ప్రజాశక్తి

సోపతి

నవంబర్ 16, 2014 ఆదివారం అనుబంధం

అత్యధిక నవలలు రాసిన
నోబెల్ మహిళ

ఎంతసేపని చూస్తారు?



- స్వీడన్ కథ 'ఉప్పురొట్టె'
- గూగుల్ క్రోమ్ వాడుతున్నారా?
- 'మలాల పుస్తకంపై సమీక్ష
- సమ్మెట గోవర్ధన్, వడ్డెబోయిన శ్రీనివాస్ కవితలు

కత్తియుద్ధాల వీరుడు

ఆయన గురువును మించిన శిష్యుడు. రాకుమార్తెలకు తోట రాముడు. జానపదాల్లో అజేయుడుగా వెండితెరపై వెలిగిన కత్తి వీరుడు 'కాంతారావు'. తెలుగు చలన చిత్ర పరిశ్రమ ప్రగతికి దోహదం చేసిన ప్రముఖుల్లో కాంతారావు పాత్ర అగ్రభాగాన ఉంటుంది. నటుడిగా, నిర్మాతగా, పరిశ్రమ శ్రేయోభిలాషిగా, దాతగా, కత్తి కాంతారావుగా, సినీ జానపద కథానాయకుడిగా కాంతారావు పేరు చిరస్మరణీయం. సుమారు 450కి పైగా సాంఘిక, పౌరాణిక, జానపద చిత్రాల్లో నటించిన తాడేపల్లి లక్ష్మీ కాంతారావు 91వ జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ఆ మహా నటుడిని ఓ సారి గుర్తు చేసుకుందాం.

తాడేపల్లి లక్ష్మీ కాంతారావు.. నల్లగొండ జిల్లాలోని కోదాడ మండలం గుడిబండ గ్రామంలో 1923 నవంబర్ 16న జన్మించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో నాయనమ్మ పెంపకంలో పెరిగారు. ధార్మికత, పురాణాల పట్ల ఆసక్తి నాయనమ్మ పెంపకం ద్వారా ఏర్పడింది. సురభి నాటకాల ద్వారా పొందిన ప్రేరణతో 'బాలమిత్ర నాట్యమండలి' అనే సంస్థను స్థాపించి గయోపాఖ్యానం, తెలుగుతల్లి, మధుసేవ, శ్రీకృష్ణలీల, కనకతార, వంటి పలు నాటకాలను మిత్రుల అండతో జనరంజకంగా ప్రదర్శించి పలువురి మన్ననలు అందుకున్నారు. 1950 సంవత్సరంలో మిత్రుల సహకారంతో మద్రాసుకి చేరుకున్నారు.

కత్తియుద్ధంలో ఆరితేరారు..

ప్రముఖ దర్శకులు హెచ్ఎం రెడ్డి సహాయ దర్శకుడైన టి కృష్ణమాచారితో కలిసి ఒకే గదిలో ఉండేవారు. అనంతర కాలంలో ఆ స్నేహం ఆయనకు బాగా కలిసి వచ్చింది. తొలి తెలుగు టాకీ తీసిన హెచ్ఎం రెడ్డి దర్శకత్వంలో 1953 సంవత్సరంలో 'ప్రతిజ్ఞ' చిత్రంతో ఆయన హీరోగా వెండితెరకు పరిచయమైనా, ఆయన నటించిన మొదటి చిత్రం 'నిర్దోషి' 1951లో విడుదలైంది. ఆ తర్వాత ఎన్టీఆర్ ఎన్ఎటి పతాకంపై తీసిన జానపద చిత్రం 'జయసింహ'లో ఎన్టీఆర్ తమ్ముడిగా నటించారు. ఆ తర్వాత 1958లో జానపద బ్రహ్మగా పేరొందిన శ్రీవి సినిమా 'జయా విజయ'లో నటించారు. ఈ చిత్రం నుంచి తెలుగులో సరికొత్త జానపద కథానాయకుడిగా టిఎల్ కాంతారావు విలక్షణ నటన ప్రారంభమైంది. దాదాపు 80కిపైగా జానపద చిత్రాల్లో హీరోగా నటించారు. జానపద చిత్రాల్లో ఆయన చేసిన కత్తియుద్ధం నాడు తెలుగునాట సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించింది. రాజనాల, కాంతారావుల కత్తియుద్ధాలు ఆనాడు జానపద చిత్రాలకు హైలెట్‌గా నిలిచాయి. డూప్‌లు లేకుండా స్వయంగా కత్తియుద్ధంలో ప్రతేక శిక్షణ తీసుకొని యుద్ధాలు చేయడంతో చిత్రసీమలో కత్తి కాంతారావుగా గుర్తించబడ్డారు.

హీరోగా 100 పైగా చిత్రాలు...

పౌరాణిక చిత్రాలలో నారదుడి పాత్రకు ఆయన పెట్టింది పేరు. కృష్ణుడిగా, శ్రీమహావిష్ణువుగా కూడా ఎన్నో చిత్రాల్లో నటించారు. ఎన్టీఆర్ తర్వాత శ్రీ కృష్ణుడి పాత్రలో కాంతారావును ప్రేక్షకులు ఆదరించారు. సుమారు 100చిత్రాల్లో హీరోగా నటించారు కాంతారావు. 'ఇలవేల్పు', 'శ్రీరామాంజనేయ యుద్ధం', 'భక్త', 'అంబరీష', 'జయావిజయ', 'శభాష్‌రాముడు', 'సతీసుకన్య', 'భక్త రఘునాథ్', 'భట్టి విక్రమార్క', 'దీపావళి', 'దేవాంతకుడు', 'అల్లూరి సీతారామరాజు', 'తులాభారం' లాంటి వైవిధ్యభరితమైన ఎన్నెన్నో చిత్రాల్లో ఆయన అపూర్వనటన అమోఘం, అజరామరం. కేవలం తెలుగులోనే కాకుండా రెండు తమిళ చిత్రాల్లో సైతం ఆయన నటించారు.

ఆస్తిని పోగొట్టుకున్నారు...

సప్తస్వరాలు, గండరగండడు, ప్రేమ జీవులు, గుండెలు తీసిన మొనగాడు, స్వాతిచినుకులులాంటి చక్కని చిత్రాలను ఆయన నిర్మించారు. కథానాయకుడిగా తాను సంపాదించిన ఆస్తి, పూర్వీకుల నుంచి సంక్రమించిన ఆస్తిపాస్తులు సమస్తం చిత్ర నిర్మాణంలో హరించుకుపోయాయి. చిత్ర సీమపై విరక్తి కలిగి 1990 సంవత్సరంలో మద్రాసు నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. ఆడపాదడపా కొన్ని చిత్రాల్లో చిన్న చిన్న పాత్రలు పోషించారు. ఆ మహానటుడు దాదాపు 40టివి సీరియళ్లలో సైతం నటించారు. 2001 సంవత్సరంలో సినీ నంది అవార్డుల కమిటీ ఛైర్మన్‌గా కాంతారావు వ్యవహరించారు.

సినిమా రాజకీయాలకు బలయ్యారు..

తెలుగు చిత్ర పరిశ్రమలో అగ్ర హీరోలు ఎన్టీఆర్, ఏఎన్నార్‌లకు దీటుగా, పలు చిత్రాల్లో హీరోగా నటించిన కాంతారావుకు వారికి వచ్చినంత పాపులారిటీ మాత్రం దక్కలేదు. సినిమా రంగంలోని రాజకీయాలకు బలైన జానపద హీరో అతను. జీవిత యుద్ధంలో ఇవన్నీ సహజమే. అడుగడుగున అడ్డంకులు, కుట్రలు, కుతంత్రాలు ఉంటాయి. వాటిని తట్టుకొని నిలవాలి, ఎదుర్కోవాలి. అలా ఎదుర్కోలేక బలైన వారిలో కాంతారావు ఒకరు. ఇండస్ట్రీలో ఆయనకు కాస్త చిన్న చూపే జరిగిందని పలువురు సినీ పెద్దలు అంటుంటారు. అయితే 'లవకుశ' సినిమాలో ఆయన చేసిన లక్ష్మణ పాత్రకు ఉత్తమ నటుడిగా రాష్ట్రపతి అవార్డు వరించింది. తెలుగు సినిమా పరిశ్రమకు ఆయన అందించిన సేవలకు గాను రాష్ట్ర ప్రభుత్వం ఆ మహానటుడికి 2000 సంవత్సరంలో రఘుపతి అవార్డుకు ఎంపికచేసింది. కాంతారావు 2009 మార్చి 22న చనిపోయారు. తెలుగు చిత్ర సీమ ఉన్నన్నాళ్లు జానపద కథానాయకుడిగా కాంతారావు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు.

– ఎ.రాజు

■ అంతరంగం

అసిధారావ్రతం

ఆదర్శాలు ప్రవచించడం కాదు ఆచరణ ప్రధానం. మాటకీ చేతకీ అంతరం లేకుండా వ్యవహరించడం సుగుణం. మాట మీద నిలబడటం మరింత ముఖ్యం. లోకరీతులకి భిన్నంగా మనసు చెప్పిన మాటని విని నడుచుకోవడం అవసరం. ఇదంతా ఒక అసిధారావ్రతం. ధర్మం, న్యాయం అనే భావనల్ని త్రికరణశుద్ధిగా అనుసరించడం ఇందులో కీలకం. న్యాయంగా ప్రవర్తించడం, మరణసమయంలోనూ చేయగూడని పనిని చేయకుండడం, దుర్జనులను యాచింపకుండడం, పేదవానిని ప్రార్థింపకుండడం, ఆపదల్లో ధైర్యంగా ఉండడం అనే సూత్రాల్ని పాటించడం అసిధారావ్రతం. ఇలాంటి సజ్జనగుణాలు స్వభావసిద్ధాలయితే ఆ మనిషి ఔన్నత్యం ఇనుమడిస్తుంది.

లోకంలో చాలామంది నీతులు ప్రవచిస్తారు. సూక్తులు ప్రబోధిస్తారు. మాటల్లో గాంభీర్యం ఒలికిస్తారు. నడతలో తేలిపోతారు. ప్రజాస్వామ్యం గురించి సుద్దులు చెప్పే నేతలు ఎందరో! పార్టీ లోపల, వెలుపల, ఇంటా బయటా అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తారు. తాము చెప్పిందే వేదమన్నట్టుగా నడిచేలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తారు. తెరవెనుక కుట్రలు, కుతంత్రాలతో మంత్రాంగం నడిపిస్తారు. ఇది పరమ పిరికివాళ్ళ లక్షణం. దుష్టుల నీచ స్వభావం. ధైర్యవంతులు సూటిగా వ్యవహరిస్తారు. నంగినంగి మాటలు చెప్పరు. కచ్చితంగా మాట్లాడుతారు. ఎందుకంటే వారి వ్యవహారశైలి ఒక అసిధారావ్రతం. అంటే కత్తివాదర మీద నడక వంటిది.

ఆత్మాభిమానం గలవారు లొంగరు. లొంగుబాటు ప్రదర్శించరు. దేబిరించరు. ఆత్మవిశ్వాసంతో ఉంటారు. జీవితంలో సమస్యలు రాకపోవు. కానీ వాటిని సవ్యంగా పరిష్కరించుకోడానికి ప్రయత్నిస్తారు. అనుకోని అవాంతరాల్ని అధిగమించే పట్టుదలతో పనిచేస్తారు. ఈ క్రమాన తమ ఆత్మాభిమానాన్ని ఎక్కడా పణంగా పెట్టరు. అవసరమైన చోట అణకువగా ఉంటూనే ఔన్నత్యాన్ని పొందుతారు. తమ పనులు చేస్తూనే ఇతరుల పనుల సాఫల్యానికి సైతం చేయూతనిస్తారు. నిరతం పరుల మేలు తలపోస్తారు. మోసం, ద్వేషం లేని ప్రవర్తనే ఆభరణంగా నడుచుకుంటారు. ఇది మనిషి ఉదత్తతను ప్రతిఫలిస్తుంది.

వెంటాడే వాక్యం ఈ క్షణాన్ని నువ్వు అనుభవించగలిగితే, నీ భవిష్యత్తును ఇంకా బాగా నిర్మించుకోగలుగుతావు. - రాబిన్ శర్మ

ప్రజాశక్తి సోపతి

నవంబర్ 16, 2014

లేఖలు 4
సంగీతం
తెలుగు చలన చిత్రాల రేడు 5
కవర్‌స్టోరీ
ఎంతసేపని చూస్తారు? 6
అనువాద కథ
ఉప్పు - రొట్టె 10
స్ఫూర్తినిచ్చిన గురువు జీవన కాంతులు 11
ఎరుక సాధికారిక జీవన పయనం! 12
జోక్స్ కార్నర్ 13
నెమలీక 14
సీరియల్ ప్రేమ - విప్లవం 16
సృజన జానపదాల జలధి జాలాది 18
ప్రేమ్‌చంద్ ప్రత్యేకత 19
అత్యధిక నవలలు రాసిన నోబెల్ మహిళ 20
నవరాగం ఇతరుల అనుభవాలు నేర్పుతాయా? 22
సోర్స్‌కోడ్ గూగుల్ క్రోమ్ వాడుతున్నారా? 23
సమీక్షలు
తీవ్రవాద దాడిని ఎదుర్కొన్న ఓ సాహస పుత్రిక 24
ఈ వారం కవిత్వం
బతికిన రోజులు 26

టీవీ సెట్ల అమ్మకాలు, టీవీ వీక్షకుల సంఖ్య పెరుగుతున్న క్రమంలో టీవీ చూసే అలవాట్ల పరిణామాలపై విశ్లేషణ ఈవారం ముఖచిత్రకథనం

లేఖలు

అలరించిన 'బాలోత్సవ్' స్టోరీ

నవంబర్ 2, సోపతి ప్రజాశక్తి అనుబంధంలో కవర్‌స్టోరీ కథనం 'సృజనలోకం బాలోత్సవ్' చదివిన తర్వాత విద్యార్థులలో అంతర్గతంగా దాగియున్న శక్తులను వెలికితీయడానికి 1991 నుండీ ఖమ్మం జిల్లా కొత్తగూడెం క్లబ్ ఆధ్వర్యంలో వాసిరెడ్డి రమేష్‌బాబు చొరవతో బాలోత్సవ్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయం. సుమారు 20 అంశాలలో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీయడం తెలంగాణ ప్రాంతానికే గర్వకారణం. మా పాఠశాల గోడ పత్రికలో కవర్‌స్టోరీని అతికించాను. మా స్కూల్ విద్యార్థులను కూడా ఈ బాలోత్సవ్‌లో పాల్గొనేలా ప్రోత్సహించాను. జయ రాజ్ ఇంటర్వ్యూ సూపర్బ్‌గా ఉంది.

– కామిడి సతీష్ రెడ్డి, పరకాల, వరంగల్ జిల్లా

పిల్లలకు సువర్ణావకాశం 'బాలోత్సవ్'

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసే ఇలాంటి బాలోత్సవ్‌లు జరగటం ఈ కాలంలో ఎంతో అవసరం. చదువు తప్ప ఇక ఎలాంటి కార్యక్రమాల జోలికి వెళ్ళని విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాల ద్వారా కొంత ఊరటను కలిగించవచ్చు. అంతేకాక, వారిలో దాగి ఉన్న ఆసక్తులను గమనించి వెలికితీసే సువర్ణావకాశం ఈ బాలోత్సవ్.

– గాయత్రి, హైదరాబాద్

మధుర గీతాల సమాహారం 'సంగీతం'

అలనాటి గీతాలలో ఎంతో అర్థం పరమార్థం ఉండేది. ఆ పాటల సాహిత్యాన్ని అర్థం చేసుకుంటే జీవితంలో వచ్చే ఎన్నో ఒడిదుడుకులను అధిగమించే శక్తి వస్తుంది. అలాంటి సమాహారంలో స్ఫూర్తి నిచ్చే గీతాల గురించి వివరించిన సోపతికి ధన్యవాదాలు. వాటిని మళ్ళీ మళ్ళీ నెమరు వేసుకునేలా వివరించారు.

– భారతి, వనపర్తి, మహబూబ్‌నగర్

'వైకల్యం' అడ్డుకాకూడదు

చిన్నప్పుడే పోలియోతో కాలు సరిగ్గా లేకపోయినా తానేమిటో నిరూపించుకుని ప్రభుత్వ ఉద్యోగం సంపాదించింది. కాని పెళ్ళి విషయంలో తాను చేసిన పొరపాటు జీవితాన్నే చిన్నాభిన్నం చేసింది. జన్మత: కాలు కుంటిదయినా పెళ్ళయిన తర్వాత మంచి చెడులను సరిగ్గా విశ్లేషించుకోలేని మెదడు, జీవితాన్నే కుంటిదాన్ని చేసిందన్న విషయాన్ని కథలో చాలా చక్కగా వివరించారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న మహిళలను పెళ్ళి చేసుకోవడం వల్ల జీవితం సుఖంగా ఉంటుందని ఆలోచించే పురుషాధిక్యులు ఉన్నంత వరకు ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి.

– సంధ్య, ఖమ్మం

అంతరంగం

అంతరంగంలో 'సహనం' నచ్చింది. మంచి చెడుల విశ్లేషించిన తీరు ఆకట్టుకుంది. సహనంలోని లక్షణాలను చెప్పారు. సహనంతో ఉండడం చేతగాని తనంగా తీసుకుంటే అది చాలా పెద్ద ప్రమాదంగా తయారవుతుంది అనడంతో చాలా నిజముంది. నోబెల్ అవార్డు అందుకున్న మహిళల పరిచయం ఉపయుక్తంగా ఉంది.

– కార్తీక్, హైదరాబాద్

మన జాతీయాలు

పొత్తుల మగడు

ఇద్దరు పెళ్ళాలున్న వాని దుర్గతి నిజ జీవితంలో చూసిన వాళ్ళకు, అనుభవించిన వాళ్ళకు ఇద్దరికి అవగతమే. ఎంత బలవంతుడైనా, మగటిమి గలవాడైనా ఒకే తరువాయిలో తన శక్తి సామర్థ్యాలను చూపెట్టలేడు. తరువాయిగా గెలవటం స్త్రీకే సాధ్యం. ఇద్దరు పెళ్ళాలను ఒకేసారిగా తృప్తిపరచటం దుస్సాధ్యం. తిట్లు, కొట్లు, శాపనార్థాలను అనుభవించవచ్చు, ఎండకోర్చుకోవచ్చుగాని వానకోర్చుకోలేము అన్నట్లు ఆంతరంగిక వేదనను భరించరాదు. పొత్తుల మగనికి చెప్పరాని తిప్పలే కుప్పతెప్పలుగా ముసురుకుంటాయి. "నా బతుకు పొత్తుల మగని అంటున్నది. మంచిగ మాట్లాడినందుకు రెండు పార్టీల వాళ్ళు ఎత్తుకపోయేంత పనిచేస్తున్నారు" అనటంలో జాతీయం వాడకం వుంది.

పసరం లేనోనికి మందాటి కావలి

పశువులు లేనివాడు మందాటి కావలి కాయటం వల్ల ఫలితమేముంటుంది. మందాటి అనగా ఊరు దీముకు పసరాలన్నింటిని అంబటి వేళవరకు నిలిపి వుంచే చోటు. ఇళ్ళ నుండి పొద్దున్నే ఊరి పశువులన్ని ఈ మందాటికి తోలుతారు. అన్నీ ఇక్కడ జమగూడేవరకు ఆకటి వేళ దాక వుంచి ఆ తర్వాత ఊరిబయట చేలలోనికి, అడవికి మేపుకోసం తోలుకుపోతారు. మందాటి దగ్గర కావలి, పసరం లేనోనికెందుకు పనిలేకనే. మందాటి దగ్గరికి రైతులు వచ్చి పసరాల మంచిచెడ్డలు, ఏదైనా రోగ నివారణకు చేసే ఉపచర్యలు చేస్తూ పిచ్చాపాటి మాట్లాడుకుంటారు. అది కొంత ఉపయోగకరమైన కార్యం. వాళ్ళతోపాటు పసరాలు లేనివారు కూడా చేరితే వృథా కాలయాపన తప్ప వీనికి వచ్చేది పోయేదేమీ వుండదు. కొందరు ఊరకే తమకు అవసరమున్నా లేకున్నా ఎక్కడ పదుగురు పోగైతే అక్కడికి చేరి ఏదో తమాషా చేస్తూ కాలక్షేపం చేస్తుంటారు. "పసరం లేనోని మందాటి కావలితీరు ఎందుకయ్యా! ఆఫీసుల పొంట పనిపాట లేకుండా తిరుగుతావు" అని సోమరిపోతులను హెచ్చరిస్తుందీ జాతీయం.

– వేముల పెరుమాళ్ళు

■ సంగీతం

సామాజిక, మానవతా విలువలతో కూడిన మంచి సినిమాలు తీసిన ఘనత ఆయనకే దక్కుతుంది. దక్షిణాది చిత్ర సీమలో మొదటిసారిగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు తీసుకుంది కూడా ఆయనే. దక్షిణ భారతదేశ సినీ చరిత్ర అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందంటే కారణం ఆయనే. దేవులపల్లి కృష్ణశాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు లాంటి సాహిత్య రంగంలో ఉద్దండులను, తెలుగు చిత్రాలకు మొదటి హీరో చిత్తూరు నాగయ్యను, ఎవర్‌గ్రీన్ గాత్రదారుడు ఘంటసాలను చిత్రసీమకు పరిచయం చేసిందీ ఆయనే. దర్శకత్వం అంటే ఇలా ఉండాలి అని... తర్వాత తరాల వారు చెప్పుకోగలిగేలా చేసిన వ్యక్తి బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్.రెడ్డి). తెలుగు సినిమాని విదేశాల్లో ప్రదర్శించేలా చేసిన ఖ్యాతి బి.ఎన్.రెడ్డికే దక్కుతుంది. మొదటి ప్రపంచ తెలుగు మహా సభల్లో రాష్ట్ర ప్రభుత్వంచేత సన్మానాలు అందుకున్న వ్యక్తి కూడా ఆయనే. తెలుగు సినిమాకు కావ్య సొబగులు అద్ది, చిత్రసీమకు విశిష్ట స్థాయిని కల్పించిన బి.ఎన్.రెడ్డి తీసిన కొన్ని సినిమాలు, పాటలు మననం చేసుకుందాం...

తెలుగు చలన చిత్రాల రేడు



బి.ఎన్.రెడ్డి

దేవులపల్లి కృష్ణశాస్త్రి

వందేమాతరం, సుమంగళి, దేవత, గృహలక్ష్మి, స్వర్గసీమ, భక్త పోతన, యోగి వేమన, బంగారు పాప, భాగ్యరేఖ, మల్లీశ్వరి, రాజమకుటం, పూజాఫలం, రంగులరాట్నం, బంగారు పంజరం వంటి ఆణిముత్యాల్లాంటి చిత్రాలు తీశారు. నిరుద్యోగం, వరకట్న సమస్యలతో 'వందేమాతరం' చిత్రం, బాల్యవివాహాలు, వితంతు పునర్వివాహాలను ఇతివృత్తంగా తీసుకున్న 'సుమంగళి' చిత్రాల నిర్మాణ, దర్శకత్వ బాధ్యతలను చేపట్టారు. అప్పట్లో 'పోతన' చిత్రం తెలుగు పరిశ్రమలో ఓ మైలురాయిగా నిలిచింది. మొదటిసారి 'స్వర్గసీమ' చిత్రంలో డూయెట్ కూడా ఆయనే పెట్టారు.

పెళ్లికి ముందే లైంగిక సంబంధాలు, పెళ్లి కాని తల్లుల సమస్యలు ఎలా ఉంటాయో చిత్తూరు నాగయ్య నటించిన 'దేవత' చిత్రంలో చిత్రీకరించారు. ఆ రోజుల్లో ఇదో పెద్ద సంచలనం. ఇలాంటి సినిమాలు తీయడమంటే పెద్ద సాహసమే. ఇందులోని "మోసకారి కామదాసుల మాటలు నీటి మూట చెలీ... రాదే చెలి నమ్మరాదే చెలీ.. మగవారినిలా నమ్మరాదే చెలీ..." అనే పాటను బెజవాడ రాజరత్నం పాడారు. ఇదే పాటను తర్వాత కాలంలో సాహిత్యంలో కొద్ది మార్పులతో పాత మిస్సమ్మ, మిస్టర్ పెళ్ళాం చిత్రాల్లో వాడారు.

ఎన్టీఆర్, భానుమతి నటించిన మల్లీశ్వరి చిత్రంలో కావ్య సొబగులు, చాటువులు, జానపద గీతాలు, మేఘ సందేశం గీతాలతో ఆణిముత్యాల్లాంటి పాటలన్నీ దేవులపల్లి కృష్ణశాస్త్రి కలం నుండి జాలువారినవే. "ఆకాశవీధిలో హాయిగా ఎగిరేవు", "పరుగులు తీయాలి.. గిత్తలు ఉరకలు వేయాలి..", "మనసున మల్లెల మాలలూగెనే....", పిలచినా బిగువటరా ఔరౌరా...", "ఆకాశవీధిలో... హాయిగా ఎగిరేవు. దేశదేశాలన్నీ తిరిగి చూసేవూ... ఏడ తానున్నాడో బావా... జాడ తెలిసిన పోయి రావా... అందాల ఓ మేఘమాల...", "కోతీబావకు పెళ్లంట, కోవెల తోట విడిదంట, ఓ బావా.. నా బావా.. ఓ రాజా.. నా రాజా..." వంటి పాటలతో ఈ చిత్రం ఈనాటికీ మేటి చిత్రంగానే నిలిచింది.

జగ్గయ్య, కృష్ణకుమారి నటించిన బంగారు పాప చిత్రంలో మాధవపెద్ది సత్యం పాడిన "తాధిమితకధిమి తోలుబొమ్మ దీని తమాష చూడవే కీల్‌బొమ్మ...", "యవ్వన మధుమనిలో వన్నెల పూవుల ఉయ్యాల" పాటలు ఇప్పటికీ ఆకట్టుకుంటాయి.

ఎన్టీఆర్, జమున నటించిన 'భాగ్యరేఖ' చిత్రంలో పి.సుశీల పాడిన "మనసూగే సఖ, తనువూగే ప్రియ... మదిలో సుఖాల డోలలూగే", "నీవుండేదాకొండపై నా స్వామి నేనుండే దీ నేలపై" పాట కథానాయిక పై చిత్రీకరించారు. ఇదే బాణీలో సాహిత్యం మార్చి కథానాయకుడు "నీ సిగ్గే సింగారమే, నీ సొగసే బంగారమే.. ఓ చెలియా నీ సొగసే బంగారమే..." అంటూ పాడే పాటలు హాయిగొలుపుతాయి.

ఎన్టీఆర్, రాజసులోచన నటించిన రాజమకుటం చిత్రంలో పి.లీల పాడిన "ఏడనున్నాడో ఎక్కడున్నాడో నా చుక్కలరేడు... చూడచక్కని చుక్కలరేడు..", "సడిసేయకోగాలి... సడిసేయబోకే.. బడలి ఒడిలో రాజు పవళించేనే..." పాటలు వినసొంపుగా ఉంటాయి.

అక్కినేని, సావిత్రి, జమున నటించిన పూజాఫలం చిత్రంలో సి.నా.రె సాహిత్యానికి ఘంటసాల పాడిన "నిన్నలేని అందమేదో నిదుర లేచెనెందుకో.. తెలియరాని రాగమేదో తీగె సాగెనెందుకో...", పి.సుశీల పాడిన "పగలే వెన్నెలా జగమే ఊయల... కదిలే ఊహలకే కన్నులుంటే...", ఓ బస్తీ దొరగారు... దిగివస్తారా మీరు... అల్లరి చిల్లరి హనుమంతులు మీకేమౌతారు" అనే పాటలు ఆనాటి మధురాలంటే ఎవ్వరూ కాదనలేరు.

అంజలీదేవి ప్రధాన పాత్రగా వచ్చిన రంగుల రాట్నం చిత్రంలో దాశరథి కృష్ణమాచార్య రాసిన "నడిరేయి ఏ జాములో స్వామి నిను చేర దిగివచ్చునో, తిరుమల శిఖరాలు దిగివచ్చునో" పాట ఘంటసాల, సుశీల గాత్రంతో మరింత మధురంగా సాగుతుంది.

బంగారు పంజరం చిత్రంలో శోభన్ బాబు, వాణిశ్రీ నటించారు. ఈ చిత్రంలో పాటలన్నీ దేవులపల్లి కృష్ణశాస్త్రి రచించారు. ఈ చిత్రంలోని "కొండల కోనల సూరీడూ.. కురిసే బంగారు నీరూ... విరిసి ఉరకేసే ఏరు... ఆ మావీ గుబురు, ఆ చింతా చిగురు... ఆ యెనక పిలిచేటి ఏరూ...పదవే పదవే పిలిచే పచ్చన్ని బీడు... కదిలే గొర్రెలబారు", గట్టుకాడ ఎవరో.. చెట్టునీడ ఎవరో నల్లకనుల నాగస్వరం ఊదేరు ఎవరో..." పాటల సాహిత్యం ఎంత మధురంగా ఉంటుందో, జానకి స్వరానికి సాలూరి రాజేశ్వరరావు సంగీతం తోడై అంతే వినసొంపుగా వుంటుంది.

తెలుగు చిత్ర పరిశ్రమకు ఇంతటి విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టిన ఆయన నేడు లేకపోయినా, సినిమాల ద్వారా మన కళ్లముందు శాశ్వతంగా నిలిచిపోయారు

- బి.మల్లేశ్వరి



ఎంతసేపని చూస్తారు?

టీవీ గురించి ప్రస్తావించుకుంటే 'మిర్చిమసాలా' చిత్రంలో నసీరుద్దీన్ షా ఒక లంబాడీ తండాలోకి రేడియో తీసుకెళ్ళి చూపించినప్పటి దృశ్యం స్ఫురణకొస్తుంది. రేడియో అనే చిన్న మిషన్‌లోంచి ఒక మనిషి మాటలు వినిపించడంతో జనాలు అదిరిపడతారు. ఇదేమి వింత అని విస్తుపోతారు. అప్పటివరకు రేడియో అన్న మాటే వారు వినలేదు. అదొకటి ఉందన్న సంగతి బొత్తిగా తెలియదు. నసీరుద్దీన్ షా వాళ్ళకు రేడియోలో పాటలు, వార్తలు వినిపిస్తే విపరీతమైన ఆశ్చర్యం! అంత చిన్నరేడియోలోకి ఒక మనిషి ఎలా ప్రవేశించాడు, ఇదేం మాయ? అని తలపోస్తారు.

అలాంటి దశలో వుండే గ్రామీణ భారతంలో ఇవాళ టీవీ దాదాపు ఇంటింటి సాధనమైంది. ఒకప్పుడు రాత్రి పదిగంటలకల్లా పల్లెలు గాఢనిద్రలో ఉండేవి. ఇప్పుడు పదకొండు గంటలు దాటేవరకు టీవీలు కంటిమీదకు కునుకు రానివ్వడం లేదు. ఇక లేట్ నైట్ క్రికెట్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారాలు చూస్తూ నిద్రపోని యువత పట్టణాల్లోనే కాదు గ్రామాల్లోనూ ఎక్కువే.

టీవీ చూడాలంటే ఇంటికెళ్ళి మాత్రమే చూడక్కర్లేదు. ఆఫీసుల్లో పిసిల్లో టీవీ చూసే సౌకర్యం వుంది కనుక ఆఫీసులోనూ చూస్తున్నారు. స్మార్ట్‌ఫోన్లలోనూ చూసే వీలు ఏర్పడటంతో స్మార్ట్ ఫోన్లలో టీవీ చూసేవారి యువతీ యువకుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందని సర్వేలు చెబుతున్నాయి. స్మార్ట్‌ఫోన్ల వాడకం పెరిగాక మెట్రో నగరాల్లోని యువతీ యువకులు సగటున కనీసం రోజుకు గంటన్నర సేపు పైగా టీవీ చూస్తున్నారని టెలివిజన్ ఆడియన్స్ మెజర్‌మెంట్ (టి.ఎ.ఏం-టామ్) సర్వే చెబుతోంది.

ఇక పిల్లలు అయితే రెండుమూడేళ్ళ వయసులోపే టీవీ చూడటానికి అలవాటు పడుతున్నారు. ఆబగా టీవీ ముందు కూర్చుని చూసే పిల్లల్ని గమనిస్తే వారు ఎంతగా టీవీ చూడటంలో లీనమయి ఉంటారో తెలుస్తుంది. అలా తదేకంగా చూస్తూ వుండిపోతారు. చూపు మరలనివ్వరు. రెప్పవాల్చకుండా టీవీలో వచ్చే దృశ్యపరంపరకు సమ్మోహితులయి చూస్తుండిపోతారు. ఏ ఇంట్లోనైనా టీవీ ముందు కూర్చున్న పిల్లల్ని గమనిస్తే ఇలా ఆబగా చూసే లక్షణం తెలిసిపోతుంది.

పెరిగిన టీవీ సెట్ల కొనుగోలు

ఈ ఏడాది టీవీ సెట్ల కొనుగోలు బాగా పెరిగింది. కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ అండ్ అప్లియెన్సెస్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్

(సి.ఇ.ఎ.ఎం.ఎ) వారి సమాచారం ప్రకారం 31 మార్చి 2014 నాటికి ఒక కోటి 64 లక్షల టీవీ సెట్లు అమ్ముడయ్యాయి. ఈ అమ్మకాల పెరుగుదల ఇలాగే కొనసాగితే కోటి 70 లక్షల టీవీ సెట్లు ఈ ఆర్థిక సంవత్సరంలో అమ్ముడవుతాయన్నది అంచనా. కొత్త టీవీల కొనుగోలులో గ్రామీణ భారతానికి చెందినవారి సంఖ్య అధికం. టీవీ సెట్లలో ఎల్సిడి టీవీ సెట్ల కొనుగోలు కూడా బాగానే వుంది. కోటి 64లక్షల టీవీ సెట్ల అమ్మకాల్లో 56లక్షల టీవీలు ఎల్సిడివి కావడం విశేషం.

టీవీలున్న ఇళ్ళ సంఖ్య 2009లో తొమ్మిది కోట్లు ఉండగా 2012 నాటికి కోటి 26 లక్షలకు పెరిగింది. ఇప్పుడు ఈ సంఖ్య కోటి 64 లక్షలకు చేరడం గమనార్హం. ఈ అంకెలు టీవీ చూసే అలవాటు జనంలో ఎంత బాగా పెరిగిందో తెలియజేస్తాయి. టీవీ అన్నది ఇంట్లో అతి పెద్ద వినోదసాధనమైంది. టాబ్లెట్లు, స్మార్ట్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ వాడకం పెరిగినప్పటికీ టీవీ వీక్షణం ఏమాత్రం తగ్గలేదని, రాన్రాను పెరుగుతుందని ఈ గణాంకాలు చెబుతున్నాయి.

విస్తరించిన డిటిహెచ్ మార్కెట్

టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో గ్రామీణ భారతం ముందంజలోనే వుంది. డైరెక్ట్ టు హోం (డిటిహెచ్) కారణంగా గ్రామీణ ప్రాంతాల్లోకి టీవీలు మరింతగా చొచ్చుకుపోయాయి. దేశవ్యాప్తంగా 2009లో డిటిహెచ్ కనెక్షన్ల సంఖ్య 13 మిలియన్లు ఉండగా 2013 నాటికి 54 మిలియన్లకు పెరిగింది. అంతేగాక 11 మిలియన్ల డిష్ టీవీ కనెక్షన్లలో సగభాగం గ్రామాల్లోనే ఉన్నాయి. డిటిహెచ్ కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో టీవీ వీక్షకుల సంఖ్య బాగా పెరిగిందని టాటా స్కై సి.ఇ.ఓ హరిత్ నాగ్‌పాల్ చెప్పారు. మరీ ముఖ్యంగా ఎన్నికల సమయాల్లో గ్రామీణ ప్రాంతాల్లో న్యూస్ చానెల్స్ చూసేవారి సంఖ్య బాగా పెరిగింది. ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకోవాలన్న వీక్షకుల ఆరాటాన్ని తీర్చేందుకు ఈ చానెల్స్ ప్రయత్నిస్తున్నాయి. సాధారణ ఎన్నికల కన్నాముందు జరిగిన నాలుగు రాష్ట్రాల (ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్) ఎన్నికల నాటికి పల్లె ప్రాంతాల్లో న్యూస్ చానెల్స్ వీక్షకుల సంఖ్య పెరిగింది. సాధారణ ఎన్నికల నాటికి ఈ సంఖ్య ఇనుమడించింది. ముఖ్యంగా న్యూస్ చానెల్స్‌కు ఒక క్రేజ్‌ను తీసుకురావడంలో ఏఏపి అధినేత అరవింద్ కేజ్రివాల్, నరేంద్రమోడీ కీలక పాత్ర వహించారని టీవీ జర్నలిస్టు రాజ్‌దీప్ సర్దేశాయి చెబుతారు. ఈ కారణంగా సాధారణ ఎన్నికల నాటికి టీవీ మాధ్యమం ప్రాధాన్యం పెరిగింది. కనుక 2014 జనవరి నుంచి జూన్ వరకు టీవీల ముందు గంటల తరబడి జనం

అవసరాన్ని బట్టి...

టీవీ ఉపయోగకర సాధనమే తప్ప ప్రమాదకారి కాదు. దానిని ఎలా వినియోగించుకుంటారన్నది మనుషుల ఆలోచన, సమయం నిర్ధారించాలి. అవసరాన్ని బట్టి చూడటం ఉత్తమం. కాలక్షేపం కోసం కూడా చూడొద్దనికాదు. మీ సమయ ప్రాధాన్యాలు గమనించుకోవాలి. నిజానికి అప్రమేయంగా మనం అనేకచోట్ల టీవీని చూస్తుంటాం. ఏవో పనులు చేసుకుంటూ చూడటం వేరు. కాని చూడటం కోసం చూడటమే అన్నది వారి వారి అవసరాలు నిర్ణయించాలి. అయితే టీవీ చూస్తూ తినే అలవాటు కూడదు. అలాగే టీవీ చూస్తూ ఎదుటివాళ్లతో కబుర్లు చెప్పడం తగదు. ఎవరయినా ఇంటికొచ్చినప్పుడు మాట్లాడుతుంటే వారి దృష్టి, మీ దృష్టి అటు వైపు మళ్ళుతుంది. కనుక కాస్సేపు టీవీని ఆఫ్ చేయడం మర్యాద. వచ్చినవారు కాస్సేపు చూడాలనుకుంటే చూడొచ్చు. లేదంటే ఆఫ్ చేయాలి. రాత్రి నిద్రపోయే ముందు టీవీలో హారర్ సినిమాలు చూడకూడదు. భార్యాభర్తలు టీవీలో వచ్చే సన్నివేశాలు, పాత్రల గురించి గంటల తరబడి చర్చలు చేయకూడదు. అవసరానికి మించి చూస్తే ఆ అనుభవం వికటిస్తుంది. కనుక ఈ జాగ్రత్తలు తీసుకుంటూ చూడటం శ్రేయస్కరం.

కూర్చునే దృశ్యాలు దేశమంతటా కనిపించేవి. ఈ కారణంగానే ఆ సమయంలో సాధారణ ఎంటర్‌టైన్‌మెంట్ చానల్స్ కన్నా న్యూస్ చానెల్స్ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇదే సమయంలో టీవీ సెట్ల అమ్మకాలు ఉధృతంగా కొనసాగాయి. రాజకీయ పార్టీలు తమ భావజాలాన్ని జనంలోకి తీసుకెళ్ళడానికి టీవీని ప్రధానమైన మాధ్యమంగా వాడుకున్నాయి. సోషల్ మీడియా పట్టణ ప్రాంతాల్లో ప్రభావితం చేస్తే, టీవీ మీడియా గ్రామీణ ప్రాంతాల్లో పని చేసింది. దీనిని బిజెపి శక్తివంతంగా ఉపయోగించుకోవడం గమనార్హం. ఈ పరిణామాల ఫలితంగా దేశంలో గత రెండు మూడేళ్ళ కాలంలో కొత్తగా న్యూస్ చానెల్స్ బాగానే ఆరంభమయ్యాయి.

798 ప్రైవేట్ చానెల్స్

మన దేశంలో 15 సెప్టెంబర్ 1959లో మొట్టమొదటి టీవీ స్టేషన్ దేశరాజధాని న్యూఢిల్లీలో మొదలైంది. తొలుత ఆల్‌ఇండియా రేడియోతో కలిసి పనిచేసింది. కానీ 1976లో రేడియో, టెలివిజన్‌ల మధ్య విభజన జరిగింది. కాగా, 1982 నుంచి జాతీయ టెలివిజన్ కార్యక్రమాల ప్రసారం ఆరంభమైంది. మొదట్లో దూరదర్శన్ ఒక్కటే వీక్షకులకు ఉన్న సాధనం. కలర్ టీవీ కూడా 1982లోనే వచ్చింది. శాటిలైట్ టీవీ కార్యక్రమాలు

1990లలో మొదలయ్యాక ప్రైవేట్ చానెల్స్ బూమ్ ఏర్పడింది. క్రమక్రమంగా టీవీ ప్రజల ఇళ్ళలో భాగమవుతూ వచ్చింది. 28 జూలై 2014 నాటికి దేశంలో 798 ప్రైవేట్ చానెల్స్ ఉన్నాయి. వీటిలో 397 న్యూస్ చానెల్స్ కాగా, 401 వార్తేతర ఎంటర్‌టైన్‌మెంట్ చానెల్స్ ఉన్నాయి. వీటిలో ఎక్కువభాగం చానెల్స్ అయిదేళ్ళ కిందటే ఆరంభమయ్యాయి. ప్రభుత్వానికి అనుబంధంగా మరో ముప్పయి చానెల్స్ ఉన్నాయి.

ఎంత సేపు చూస్తారు?

టీవీ వీక్షకుల సంఖ్య భారీగా పెరుగుతూ వచ్చింది. అలాగే టీవీ చూసే సమయాలు కూడా పెరుగుతున్నాయి. రకరకాల ప్రోగ్రామ్‌లకు వీక్షకుల సంఖ్య వివిధ రకాల స్థాయిల్లో ఉంది. ఈదేశంలో దూరదర్శన్ సీరియల్స్ రామాయణం, మహాభారతం ప్రసారాలు విజయవంతం కావడంతో సీరియల్స్ తయారీ ఒక పరిశ్రమగా విస్తరించింది. ఎంటర్‌టైన్‌మెంట్ చానెల్స్‌కు సీరియళ్ళు ప్రధాన వనరుగా మారాయి. వీటికి పెరిగే ప్రేక్షకుల సంఖ్య ఆయా చానెల్స్ రేటింగ్స్‌ని నిర్ణయిస్తాయి. సాయంత్రం ఏడు నుంచి పది గంటల లోపు మహిళలు ఎక్కువగా టీవీ సీరియళ్ళు చూస్తున్నారు. సగటున మహిళలు వారానికి పదమూడు గంటలు టీవీ చూస్తూ గడుపుతుంటారు. సీరియల్స్ వచ్చే సమయంలో చెప్పా పెట్టకుండా ఇంటికెవరయినా వస్తే సరిగా మాట్లాడరు. సీరియల్‌లో ఏం జరగబోతుందోనన్న అంశమే వారి మెదడులో కేంద్రీకృతమై వుంటుంది. కనుక ఆ అరగంటలో పెద్దగా మాట్లాడకుండానే టీవీ వైపు దృష్టి సారిస్తారు. వచ్చినవారు తప్పనిసరయి టీవీ ప్రేక్షకులవ్వాల్సిందే. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రాంతీయ భాషల్లో వచ్చే సీరియల్స్‌కు వీక్షకుల సంఖ్య ఎక్కువ. అలాగే ఆధ్యాత్మికపరమైన సీరియల్స్‌ను కూడా ఎక్కువగా చూస్తున్నారు. కేవలం సీరియల్స్ మాత్రమే కాదు, సీరియల్స్ ప్రసార సమయాల్లో వచ్చే వాణిజ్య ప్రకటనల ప్రభావం ఆడవాళ్ళ మీద మరింత ఎక్కువ. జీవితానికి సంబంధించిన నమూనాల నిర్దేశంలో టీవీ ప్రాబల్యం అపరిమితం. అందుకని టీవీ కార్యక్రమాలు బతుకులో భాగమయ్యాయి.

పిల్లలపై ప్రభావం

రెండున్నర ఏళ్ళలోపు టీవీ చూడటానికి అలవాటు పడే పిల్లల్లో ఆరోగ్యసమస్యలు ఏర్పడటం, ప్రతిభ, తెలివిని ప్రదర్శించడంలో నేర్పు లోపించడం ప్రధాన సమస్యలుగా పరిణమించాయని టీవీ వీక్షకులపై జరుపుతున్న సర్వేలు చెబుతున్నాయి. పిల్లల్ని లక్ష్యంగా చేసుకొని రూపొందించిన ప్రసారాలు చూసే అలవాటు వారి చదువులపై దుష్ప్రభావం చూపుతుంది. పిల్లల్ని చదువుకోవలసిందిగా చెప్పి, పెద్దవాళ్ళు టీవీల దగ్గర కూలబడటం కూడా సరయింది కాదు. పిల్లలు ఏం చూడాలో, ఏం చూడకూడదో, ఎంతసేపు చూడాలో కచ్చితంగా నిర్దేశించాలి. టీవీ చూడటానికి సంబంధించిన నియంత్రణలు పెట్టకపోతే వారి చదువులు దెబ్బతినడమే కాదు, ఆరోగ్యం పాడయి జబ్బులు వస్తాయి. భవిష్యత్తు పాడవుతుంది. బాల్యం హరిస్తుంది. కనుక పిల్లల టీవీ చూసే అలవాట్లను నియంత్రించడం తప్పనిసరి.

పరిమితుల్లో ఉండాలి

కొన్నేళ్ళుగా ప్రైవేట్ స్కూల్ యజమాన్యాలు పిల్లల్ని టీవీ చూడొద్దని చెబుతున్నాయి. పొద్దుట ఎనిమిది గంటలకు ఇంట్లోంచి వెళ్ళి రాత్రి ఏడు గంటలకు వస్తున్నారు కొన్ని స్కూళ్ళ పిల్లలు. ఆ తర్వాత కూడా టీవీ చూడొద్దన్నది వారి సలహా. రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీల్లో అయితే పిల్లల్ని టీవీ ఉండదసలు. ఎనిమిదో తరగతి నుంచి ఐఐటికి పిల్లల్ని సిద్ధం చేసే తల్లిదండ్రులు టీవీని అటక ఎక్కిస్తున్నారు. ఇక పరీక్షలప్పుడు జనవరి నుంచి ఏప్రిల్ వరకు టీవీ కేబుల్ కనెక్షన్ కట్ చేయిస్తున్నారు. టీవీ చూడటం అవసరమా అనే ప్రశ్న వచ్చిన తల్లిదండ్రులు తీసుకుంటున్న చర్యలివి. ఇక ఇతరులు తమ కాలక్షేపం కోసం టీవీని ఆశ్రయిస్తున్నారు. అయితే ఎంతసేపు చూస్తారు, ఏం చూస్తారన్నది ప్రధానం. పరిమితుల్లో చూడాలే తప్ప రాత్రిళ్ళు నిద్రపోకుండా గంటల తరబడి టీవీ ముందు కూర్చోవడం మంచిది కాదు. వినోదం, విజ్ఞానం కలగలిసిన కార్యక్రమాలు చూడటంలో అర్థం వుంటుంది. అలాగే సెలవురోజుల్లో టీవీని ఎక్కువగా చూసే అలవాటును నియంత్రించుకోవాలి. యానిమేషన్, కార్టూన్ ఆధారిత కార్యక్రమాల్ని, సినిమాల్ని పిల్లలు బాగా చూస్తుంటారు. ఈ సమయాల్ని పరిమితం చేసుకోవాలి.

ఇల్లే థియేటర్‌గా మారి...

టీవీ చానెల్స్ కార్యక్రమాల్లో ఎక్కువభాగం సినిమా, సినిమా కార్యక్రమాలతో ముడిపడినవే వున్నాయి. ఇంటిని ఒక థియేటర్‌గా మార్చి 24 గంటలు సినిమాల్ని ప్రసారం చేస్తున్న చానెల్స్ కూడా ఉన్నాయి. గతంలో రాత్రి పదకొండు గంటల తర్వాత "ఇంతటితో రేడియో కార్యక్రమాలు సమాప్తం" అన్న ప్రకటన వచ్చేది. డి.డి. కార్యక్రమాల్లో కూడా దీన్ని చూసేవాళ్ళం. కానీ 24 గంటలు టీవీ ప్రసారాలు కొనసాగే

రోజులు వచ్చాక సమయాన్ని పూరించడం అనివార్యమైంది. అందుకని సినిమా ఆధారిత కార్యక్రమాల జోరు ఎంటర్‌టైన్‌మెంట్ చానెల్స్‌లో మామూలయింది. అందుకని అర్ధరాత్రి అపరాత్రి అని కాకుండా ఎప్పుడంటే అప్పుడు టీవీ చూడటం అలవాటయింది.

ఈ క్రమంలో మనుషులు తమ నుంచి తాము తప్పించుకోడానికి టీవీ ముందు కూర్చుంటున్నారు. పెద్దవాళ్ళు పిల్లల్ని టీవీల ముందు కూర్చోబెట్టి కబుర్లలో పడిపోతుంటారు. దరిమిలా గంటల తరబడి టీవీ చూసే అలవాటు పెరిగింది. అంతేగాక ఏకకాలంలో అనేక చానెల్స్ తిరగేయడం వ్యసనమైంది. ఈరకమైన అలవాటుతో మనుషులు ఏకాంతంలో గడపటమే తగ్గిపోయింది. క్షణం తీరుబడి లేని పనిలోనో, టీవీ చూడటంలోనో ఏళ్ళకు ఏళ్ళు గడిపేసే స్థితి ఏర్పడింది. ఈ వ్యాపకాల్లో బతుకు నెట్టుకు రావడం సగటు భారతీయుల జీవన విధానమైంది.

జీవనవిధానాలపై ప్రభావం

టీవీ ఎంతగా చూస్తే అంతగా అది మనిషి జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఏ కొద్దిమందో మినహాయిస్తే దాదాపుగా టీవీ చూడటం నిత్యజీవితంలో భాగమైంది. నిజానికి ఏం చూడాలో, చూడకూడదో నిర్ణయించుకోవాలి. టీవీ అవసరమైన సాధనమనే మాటతో పేచీలేదు. కానీ స్వీయనియంత్రణ అవసరం. విద్యార్థుల్ని రకరకాల క్విజ్ ప్రోగ్రామ్‌ల ద్వారా దూరదర్శన్ కార్యక్రమాలు ఆకర్షించాయి. అందువల్ల ఎడ్యుకేట్ చేసే లక్షణం ఉన్న కార్యక్రమాలు చూడాలనే మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. హిస్టరీ చానెల్, డిస్కవరీ చానెల్, నేషనల్ జియోగ్రాఫిక్ చానెల్ వంటి కార్యక్రమాలు మనుషులకు జ్ఞానాన్ని అందిస్తాయి. వారి మానసిక చైతన్యాన్ని తేజోమయం చేస్తాయి. కొత్త విషయాలు తెలుసుకున్నామన్న అనుభూతిని అందిస్తాయి. ఇలాంటి చానెల్స్ మరికొన్ని వున్నాయి. వీటిలో అవసరమైన వాటిని, తమ వీలును బట్టి చూసుకోవచ్చు. అందుకని ఎంతసేపు చూస్తారు, ఎలాంటి సమయాల్లో చూస్తారు, ఏయే చానెల్స్ చూస్తారన్నది ఆలోచించి నిర్ణయించుకోవాలి. గంటల తరబడి చూడటం కంటికి మంచిది కాదు. వంటికీ మంచిది కాదు. ఈ సంగతి పెద్దలు గుర్తుంచుకోవాలి. పిల్లల మనసు నొప్పించకుండా చెప్పాలి. టీవీ కోసం మనం లేము, మన కోసం మాత్రమే టీవీ వుంది. కనుక ఈ అవసరమైన సాధనాన్ని వాడుకోవడంలో, చూడటంలో విజ్ఞత ప్రదర్శించడం ఉత్తమం.

– కుమార్

ముప్పై రోజులు చూస్తున్నారా?

టీవీ చూడటం తప్పు కాదు, ఎందుకు చూస్తున్నారు, ఏం చూస్తున్నారు, ఎంత సేపు చూస్తున్నారు అన్న అంశాలు ముఖ్యమని 'ఇండియా బిక్స్' అనే వెబ్‌సైట్ జరిపిన సర్వేకు తమ అభిప్రాయాలు తెలియజేశారు. వేగంగా సమాచారం అందించడం టీవీ చానెల్ వల్ల ప్రధాన ఉపయోగం. ఆ సమాచారాన్ని ఏరకంగా స్వీకరిస్తారు, ఏవిధంగా స్పందిస్తారన్నది ప్రధానం. టీవీ కార్యక్రమాల సద్వినియోగం సైతం మనిషి దృక్పథం మీద ఆధారపడివుంది. అందుకని వివేచన ముఖ్యం. కొన్ని ఆదివారాలు టీవీని, మొబైల్‌ను పక్కనపెట్టి ఏకాంతంగా గడపాల్సిందిగా ప్రముఖ వ్యక్తిత్వ వికాస పుస్తకాల రచయిత రాబిన్‌శర్మ చెప్పారు. టీవీకి ఎక్కువగా అలవాటు పడుతున్న జనాల ధోరణి చూసి ఆయన ఈ మాట అన్నారు. టీవీ స్క్రీన్ ఎన్నటికీ నిద్రపోదు, మనుషులు కూడా అలా ఉంటారా అన్నది కొందరి ప్రశ్న. వినోదం కోసమో, సమాచారం కోసమో గంటల తరబడి టీవీకి అతుక్కుపోవడం విలువైన జీవితకాలాన్ని వృథాపుచ్చడమేనని 'ఎనఫ్' పుస్తక రచయిత జాన్ నైష్ చెబుతారు. సగటున రోజుకు రెండు గంటలు టీవీ చూడటమంటే నెలకు అరవై గంటలు, ఏడాదికి 720 గంటలు. దీన్ని రోజుల్లోకి మారిస్తే... 30 రోజులు. అంటే ఏడాది కాలంలో ఒక నెలరోజులపాటు మొత్తం టీవీని చూడటంలో గడపటమని అర్థం. ఇలా 30 రోజులు టీవీ చూసేవారి జాబితాలో మీరు ఉన్నారా మరి!

మర్చిపోలేని సంఘటన

మీ జీవితంలో మర్చిపోలేని విషయాలు, బాగా ఇష్టమైన విషయాలు ఇందులో ఏమైనా ఉన్నాయేమో చూడండి...

★ చివరి పరీక్ష రాసిన రోజు

★ ఏ అర్ధరాత్రో మెలకువ వచ్చి తెల్లారిందనుకుని టైం చూస్తే, తెల్లారడానికి ఇంకా చాలా సమయం ఉన్నప్పుడు

★ స్కూల్/ కాలేజ్/ ఆఫీస్ కి అనుకోకుండా సెలవు ఉందని తెలిసినప్పుడు

★ బాగా ఇష్టమైన వ్యక్తి అనుకోకుండా తారసపడినప్పుడు

★ ఎప్పుడో ఎలిమెంటరీ స్కూల్లో మనతో పాటు చదివిన స్నేహితులు కనిపించినప్పుడు

★ ఆదివారం సాయంత్రాలు పాత స్నేహితులతో కబుర్లు

★ ఎవరి కోసమైనా ఒంటరిగా ఎదురు చూడడం

★ బాగా వర్షం పడుతున్నప్పుడు హైవే రోడ్డుమీద ప్రయాణం

ఈ విధంగా మీరు మరిచిపోలేని అరుదైన సంఘటన గురించి రాసి మీ ఫొటోతో సహా పంపించండి. సోపతిలో ప్రచురిస్తాం.

■ అనువాద కథ

పూర్వం ఒక రాజుండేవాడు. ఆ రాజుకు ముగ్గురు కూతుళ్లు. ఆ ముగ్గురిలో కడసారి కూతురు మీద రాజుకి ప్రేమ ఎక్కువ. అందువల్ల తక్కిన ఇద్దరు కూతుళ్ళకి కోపంగా ఉండేది. అసూయతో ఎట్లాగైనా సరే, తండ్రికి కడగొట్టు చెల్లెలంటే ప్రేమ లేకుండా చెయ్యాలని పెద్ద కూతుళ్ళిద్దరూ ఎన్నో ప్రయత్నాలు చేశారు. సమయం దొరికినప్పుడల్లా, తండ్రికి తమమీద ప్రేమ ఎక్కువ అవటానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుండేవారు. వీలు దొరికినప్పుడల్లా ఆ పిల్ల మీద తండ్రితో చాడీలు, పితూరీలు చెప్పేవాళ్లు. ఆ చిన్న కూతురికి తండ్రిమీద కొంచెం కూడా ప్రేమ, విశ్వాసం లేవనేవాళ్లు. ఈ చుప్పనాతి తనం వల్ల ఎప్పుడూ మనస్సులో కలవరపడుతునే ఉండేవాళ్లు. అసూయ పిశాచంలా వాళ్ళని

ఉప్పు-రొట్టె

బాధిస్తూండేది.

రాజు ఈ చెప్పుడు మాటలన్నీ వినగా వినగా, చిన్న కూతురికి తన మీద నిజంగానే ప్రేమ లేదేమో అని అనుమాన పడ్డాడు.

ఒక రోజున, ముగ్గురు కూతుళ్లూ సంతోషంగా తండ్రి చుట్టూ కూర్చొని ఉన్నారు. అప్పుడు రాజు ముగ్గురు కూతుళ్ళ మనస్సులూ పరీక్షించాలనుకున్నాడు. తన మీద ఎవరికి ఎంత ప్రేమ ఉన్నదీ తెలుసుకోవాలని ఆయన కుతూహలం. ముందుగా పెద్ద కూతుర్ని పిలిచి తన మీద ఆమెకి ఎంత ప్రేమ ఉందో చెప్పమన్నాడు.

"నాన్నగారూ! నిజంగా నేను స్వర్గంలో ఉన్న భగవంతుణ్ణి ఎంత ప్రేమిస్తున్నానో మిమ్మల్నీ అంత ప్రేమిస్తున్నాను" అంది పెద్ద కూతురు. ఆ మాటలు విని రాజు సంతోషించాడు.

రెండవ కూతుర్ని కూడా అదే ప్రశ్న అడిగాడు.

"నాన్నగారూ! నిజంగా మిమ్మల్ని నా ప్రాణంతో సమానంగా ప్రేమిస్తున్నాను" అంది ఆమె. ఈ మాటలు కూడా రాజు మనస్సుకీ ఎంతో సంతోషం కలిగించాయి.

తరువాత రాజు చిన్న అమ్మాయి వైపు తిరిగి, "నా మీద నీ కెంత ప్రేముందో నువ్వుకూడా చెప్పమ్మా" అన్నాడు.

"నాన్నగారూ! మనం తినే ఆహారంలో నాకు రొట్టెమీద, ఉప్పు మీద ఎంత ప్రేమో, మీరన్నా అంతే ప్రేమ" అంది ఆమె. (మనం అన్నం తిన్నట్లు ఈ దేశపు వాళ్ళు రొట్టె తింటారు.)

ఈ మాటలు వినేసరికి రాజుకీ ఆశ్చర్యం కలిగింది. పేద వాళ్లు కూడా తినే రొట్టె, ఉప్పు మీద ఉన్నంత ప్రేమ తన మీద ఉందనే సరికి రాజుకి చాలా కోపం వచ్చింది. వెంటనే తన సేవకుల్ని పిలిచి, తన కడసారి కూతుర్ని ఇంట్లోంచి తరిమివేయమన్నాడు. రాజుగారి ఆజ్ఞ ప్రకారం సేవకులు రాజకుమారిని తీసుకుపోయి నట్టడివిలో వదిలిపెట్టారు. తక్కిన ఇద్దరి కూతుళ్ళకీ కళ్లు చల్లబడ్డాయి.

ఆ రాజకుమారి పాపం ఆ అడవిలో దారి, దోవ తోచక ఎంతో భయపడిపోయింది. తనను గారాబంగా పెంచిన తండ్రిని, ఇంటిని తలచుకొని వలవల ఏడ్చింది. అంత పెద్ద అడవిలో తాను ఒక్కతే! ఏం చేస్తుంది? ఎక్కడికని పోతుంది? తండ్రికి తన మీద ఎందుకు కోపం వచ్చిందో, ఎందుకిలా తనను అడవుల పాలు చేశాడో ఆమెకు ఏమీ అర్థంకాలేదు. ఆ నట్టడవిలో తిండి, తిప్పలూ లేకుండా తిరిగి తిరిగి ఆలసిపోయింది. ఆ అడవిలో క్రూరమృగాలు చంపేస్తాయేమోనని భయపడి, పెద్ద చెట్టుమీద ఎక్కి కూర్చోంది ప్రాణం కాపాడుకోటానికి.

అదృష్టం కొద్దీ, అడవిలోకి ఎవరో ఒక రాజకుమారుడు వేట కోసం వచ్చాడు. గుఱ్ఱంమీద ఎక్కి, వేట కుక్కలతో సహా వచ్చాడు. కొంతసేపటికి, వేట కుక్కలు బిగ్గరగా మొరగటం రాజు విన్నాడు. అవి పోయిన దారినే పోయి చూశాడు. వేటకుక్కలు ఒక పెద్ద చెట్టు చుట్టూ తిరుగుతూ మొరగటం విన్నాడు. తల పైకెత్తి చెట్టుమీద ఒక వేళ ఎలుగుబంటి ఏదైనా వుందేమోనని చూశాడు. ఎలుగుబంటి లేదు. సరిగదా, ఒక అందమైన అమ్మాయి చెట్టుమీద విచారంగా కూర్చొని ఉండడం చూసి ఆశ్చర్యపోయాడు.

ఆమెను చూడగానే రాజుకి జాలి కలిగింది. ప్రేమతో పలకరించాడు. మెల్లగా చెట్టుదిగి రమ్మని కోరాడు. ఆమె దిగి రాగానే, గుఱ్ఱం మీద ఎక్కించుకొని తన రాజభవనానికి తీసుకు వెళ్ళిపోయాడు. ఆమెకు స్నానానికి, భోజనానికి, ఉండటానికీ కావలసిన అన్ని సౌకర్యాలు చేయించాడు.

రాజకుమారుడు తనని ఇంత దయగా చూస్తున్నందుకు ఆ రాజకుమార్తెకి ఎంతో సంతోషం కలిగింది.

ఆయన ఆడిగేసరికి, తను పడ్డ కష్టాలన్నీ, తన కథంతా చెప్పింది. ఆ రాజకన్య మంచితనం, అంద చందం ఆ రాజకుమారుడికి ఎంతో ముచ్చటగా ఉన్నాయి. రాజ భవనంలో ఆమె సుఖంగా కాలం గడుపుతూ వచ్చింది. కొన్నాళ్ళకి రాజు ఆమెను ప్రేమించి పెండ్లి

చేసుకోవాలనుకున్నాడు. ఆమె కూడా ఆ రాజకుమారుని మనసారా ప్రేమించింది. పెండ్లి చేసుకుందామని నిశ్చయించుకున్నారు.

పెళ్ళికి మంచి ముహూర్తం పెట్టించారు. చుట్టూ గల ఏడు దేశాల రాజులకి ఆహ్వాన పత్రికలు పంపారు. పెళ్ళికి ఆ రాజులు, చక్రవర్తులు, బంధువులు, స్నేహితులు అంతా వచ్చారు. పెళ్ళికి వచ్చిన రాజులలో ఆ పెళ్ళికూతురు తండ్రి కూడా ఉన్నాడు. ఆయనతోపాటు ఆమె ఇద్దరు అక్కలు కూడా వచ్చారు. అయితే వాళ్ళెవరూ పెళ్ళికూతుర్ని గుర్తుపట్టలేక పోయారు. తమ చెల్లెలు ఆ అడవిలో అప్పుడే చనిపోయి ఉంటుందనుకున్నారు.

పెళ్ళి విందుకి చాలా గొప్పగా ఏర్పాట్లు చేయించారు. రకరకాల పిండివంటలతో సిద్ధం చేశారు. పెళ్ళికి వచ్చిన వారంతా భోజనానికి కూర్చున్నారు. ముఖ్యంగా ముగ్గురు కూతుళ్ళ తండ్రికి బాగా మర్యాదచేసి, పెద్దపీట వేసి వడ్డించారు. ఆయనకు అన్నీ వడ్డించారుగాని, రొట్టె, ఉప్పుమాత్రం వడ్డించలేదు. దేంట్లోను ఉప్పులేదు. రాజకన్య తండ్రి ఏది నోట్లో పెట్టుకున్నా ఉప్పులేదు. చప్పగా వుంది. రొట్టె అసలే లేదు. అటు చూశాడు, ఇటుచూశాడు. చివరికి ఉండబట్టలేక, "ఇదేమిటి, నాకు అర్థం కావటంలేదు. విందులో వుండవలసిన రెండు ముఖ్యమైన పదార్థాలు, రొట్టె, ఉప్పు లేకుండా చేశారు. ఇదేం విందు?" అన్నాడు.

రాణిగా అలంకరించుకుని వచ్చి అక్కడ నిలబడి చూస్తూన్న పెళ్లికూతురు ఆ మాట విన్న వెంటనే నవ్వుతూ, "ఏమిటీ? విందును గురించి ఏదో అంటున్నారు?" అంది.

"మరేమీ లేదమ్మా! ఇంత గొప్ప విందులో అన్నిటికన్నా ముఖ్యమైన ఉప్పు, రొట్టె లోపం చేశారేమిటా! అనుకుంటున్నాను."

"అవును. ప్రపంచంలో అవి రెండే చాలా ముఖ్యమైనవి. ఒకప్పుడు నేను మా నాన్నగారిని ఈ రెంటితో సమానంగా ప్రేమిస్తున్నానని చెప్పినందుకే నన్ను ఇంట్లోంచి గెంటించి, అడవులపాలు చేశారు" అని చెప్పింది.

ఈ మాటలు వినగానే తండ్రి ఆమె తన కూతురని గ్రహించాడు. ఆ సంతోషంలో పెద్ద కేకపెట్టి "తల్లీ" అంటూ ఆమెను ప్రేమతో కౌగలించుకొన్నాడు. తనపైన ఆమెకు గల నిజమైన ప్రేమను అర్థం చేసుకోలేక, ఆమెను అడవికి తరిమి, కష్టపెట్టి నందుకు క్షమించమని బ్రతిమాలాడు.

అక్కలిద్దరూ చెల్లెలిపైన అసూయతో పన్నిన కుట్రంతా గ్రహించాడు. పెద్దకూతుళ్ళిద్దరిని ఇంటి నుండి అడవికి తరిమేశాడు. వాళ్ళగతి ఏమైందో ఆ నాటినుండి ఈనాటివరకు ఎవ్వరికీ తెలియదు, ఏ రాజకుమారులైనా అడవికి వేటకోసం వచ్చి వాళ్ళని రక్షించారో లేదో ఎవరూ వినలేదు, అనుకోలేదు.

(స్వీడన్ కథకు అనువాదం)

అనువాదం : కనకదుర్గా రామచంద్రన్

స్ఫూర్తినిచ్చిన గురువు ■

జీవన కాంతులు

ఎందరో గురువులు అందరికీ వందనాలు. అక్షరాలు నేర్పిన మా చక్రధర్ సార్, ఆశయాన్ని నేర్పిన మా సుబ్బారావు సార్, నేటి ఈ జీవితానికి మార్గదర్శియైన మా వీరాచారి మాస్టారు... వీరికిమాత్రం ప్రతేక ధన్యవాదాలు. నా పేరు అవినాష్. చిన్నప్పుడు మోతుకూరు పాఠశాలలో చదువుకున్నాను. అక్కడ అన్ని తరగతులకు కలిపి ఒకే టీచర్ ఉండేవారు. ఆయనే చక్రధర్ మాస్టారు. అంతమందికి కూడా ఎంతో ఓపికతో కోప్పడకుండా, విసుక్కోకుండా చెప్పేవారు. నాలుగో తరగతికి హైస్కూల్లో చేరేటప్పటికి నాకంతా అయోమయంగా అనిపించింది. స్కూలు మానేద్దామన్నంత భయపడ్డాను. ఆ సమయంలోనే సుబ్బారావు మాస్టారు పరిచయమయ్యారు. ఉదయపు వెలుగు రేఖలా వచ్చి నా భవిష్యత్తుకు బాటలు వేశారు. పరిశీలించడం, ప్రశ్నించడం, సహకరించడం నేర్పించి నాలో వ్యక్తిత్వాన్ని నింపారు.

సి.కె.ఎం. కాలేజీలో తెలుగు ఎం.ఎ చదుతున్నప్పుడు నాలో సాహిత్యాభిలాషను మేల్కొలిపి, నాచే కవితలు రాయించి, వాటిని ఆకాశవాణి వరంగల్ కేంద్రంలో ప్రసారం చేయించారు వీరాచారి సార్. అలా వచ్చిన గౌరవ భృతితో ఎన్నో విలువైన పుస్తకాలు కొనిపించి, సాహిత్యం పట్ల, భాష పట్ల మమకారాన్ని పెంచారాయన. చీకటిని చీల్చి వెలుగు నింపేది 'గురు' శబ్దం. ఒక వ్యక్తికి విద్యార్థి దశ నుండి పరిపూర్ణ మూర్తిమత్వంతో ఎదగడానికి, ఈ సమాజానికి ఇతోధికంగా సేవ చేయడానికి తమ జీవితాలను త్యాగం చేసి, తమకు తెలిసిన విద్యను ధారపోసి కొవ్వొత్తిలా కరిగిపోయే ఎందరో గురువులను నా విద్యా జీవితంలో చూసినా, పై ముగ్గురు మాత్రం నా జీవిత నిర్దేశకులు కావడం నా అదృష్టం.

– మర్రి అవినాష్, ఓదెల

ప్రగతికి మూలాలు – స్ఫూర్తినిచ్చిన గురువులు

నా పేరు వి.సునంద. నేను నల్గొండ జిల్లా సిరికొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతివరకు చదువుకున్నాను. మా స్కూల్లో రాజేశ్వరరావు మాస్టారు తెలుగు, సాగర్, జనార్ధనాచారి మాస్టార్లు ఇంగ్లీషు, గుమ్మయ్య, సర్వోజీ మాస్టార్లు సోషల్, పి.రాములు సార్ హెచ్.ఎంగా ఉండేవారు. బి.సోమిరెడ్డి మాస్టారు సైన్స్, అయోధ్యరాములు సార్ హిందీ, నర్సిరెడ్డి సార్ లెక్కలు బోధించేవారు.

అప్పట్లో ఆడపిల్లలు చదువుకోవడం అంత ప్రాముఖ్యం ఉండేది కాదు. బాల్య వివాహాలు ఎక్కువగా జరిగేవి. ఊళ్లో ఉన్నంత వరకు చదివించేవారు. ఇంట్లో ఏ చిన్న పని ఉన్నా స్కూలు మానేయాల్సిందే. అలాంటి పరిస్థితుల మధ్య పరిగిన నాలో తెలుగు భాష పట్ల అభిమానం పెంచి, ఈ రోజు ఓ కవయిత్రిగా, రచయిత్రిగా అంతో ఇంతో పేరు తెచ్చుకోడానికి కారకులు తెలుగు బోధించిన రాజేశ్వరరావు మాస్టారు. సోషల్ పాఠాలు చెప్పిన సర్వోజీ మాస్టారు. తెలుగు పాఠాలను ఎంతో ఆసక్తిగా, హృదయానికి హత్తుకునేట్లుగా చెప్పేవారు రాజేశ్వరరావు సార్. రైటింగ్ బాగుంటే కాంప్లిమెంట్లు ఇచ్చి ఇంకా ఎక్కువ రాయడానికి ప్రోత్సహించేవారు. సర్వోజీ సార్ సమాజ సంబంధాల గురించి చెప్తూ ప్రశ్నలు అడిగేవారు. సరైన సమాధానం చెప్పినవారికి చదువుకోడానికి లైబ్రరీలో పుస్తకాలు ఇంటికి కూడా ఇచ్చేవారు. ఆ విధంగా పదో తరగతి పూర్తయ్యేసరికి విశ్వనాథ వేయి పడగలు, సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి వంటి పుస్తకాలు చదవగలిగాం. అలా చదువు మీద ఆశక్తితో పదవ తరగతిలోనే పెళ్లయినా తర్వాత మా వారిని ఒప్పించి బిఇడి వరకు చదివాను. ప్రస్తుతం ఖమ్మం జిల్లా యుపిఎస్ లక్ష్మీపురంలో టీచర్‌గా చేస్తూ, మా ఉపాధ్యాయుల బాటలోనే నడుస్తున్నాను.

– వి.సునంద, ఖమ్మం

■ ఎరుక : మునిమడుగుల రాజారావు

సాధికారిక జీవన పయనం!

“కొక్కొరో-కో!” (ఒక్కడేనూ- అనే అర్థాన్ని ధ్వనింపచేస్తూ) తొలి కోడి కూసింది. “సై...సై,సై” (నిజం! నువ్వనే మాట నిజం, నిజం) అంటూ కోడి కూతకు వత్తాసు పలుకుతూ పిచ్చుకలు లేచాయి. ‘నిద్ర దుప్పటిని’ నిలువుగా తన్నేసి నిద్ర లేచిన పల్లె తలుపుల్ని తెరచింది. సందుల్లో దాక్కున చీకట్లని చీపుళ్లతో తరిమింది. వాకిళ్లపై కళ్లాపి చల్లింది. పిండి ముగ్గులు వేసి కొత్త పొద్దుకు స్వాగతం పలికింది. ఊళ్లోని కోవెల గంట మోగించింది. ఆలయ శిఖరం మీంచి బళ్లున లేచిన పక్షుల కిలకిలా రావాలు పల్లె నిండిన సప్తస్వరాల రాగాలైనాయి. చుట్టూ పొలాలు, పచ్చని చేలు, ఊరిలో పూల చెట్లతో- పల్లె ఇప్పుడు ఆకు పచ్చని చీరకట్టుకుని, జడలో పూలు తురుముకున్న అచ్చమైన తెలుగమ్మాయిలా ఉంది. వీధి కిరువైపులా కొబ్బరి చెట్లు, ఆ చెట్ల కొమ్మల్లోంచి తొంగి చూస్తూ నేలపైకి జారుతోన్న ఉదయభానుడి నులివెచ్చని కిరణాలు-

ఆ వీధిలో అడుగులో అడుగు వేసుకుంటూ ఒకతను ఉదయం పూట నడక సాగిస్తున్నాడు. అతడు నడుస్తూంటే- అడుగుల్ని లెక్కపెడుతున్నాడా! ఏంటీ? అన్నట్లుగా ఉంది. “ఏం చేస్తున్నారు మీరు?” అతడిని అడిగాను. నా మాటకు బదులిస్తూ “భూమి స్పర్శ నా పాదాలకు తగుల్తూ ఉంటే దానిని అనుభవిస్తూ నడుస్తున్నాను. ఆ అనుభూతిని పొందాలంటే ఇలా నిదానంగా, నెమ్మదిగా, ఎరుకతో నడవడమే ప్రామాణికం. కర్రతో చేసిన పాదరక్షలు వేసుకుని ఆనాడు గౌతమ బుద్ధుడు, రాఘవేంద్ర స్వామి, వంటి యోగులు, మునులు ఇలాగే నడిచేవారు” అని అన్నాడు.

అలా ఎంతో దూరం వెళ్లాక అతడిని ఒక వేపచెట్టు ఆపింది. రోజూ వెళ్లడం మూలాన చెట్టుతో స్నేహ బంధం బలపడి, దాని భాష కూడా అతడికి అర్థమవుతోంది. దాని కొమ్మతో కరచాలనం చేసి ఒక వేప పుల్లని, రెండు ఆకుల్ని దాని అనుమతితో తెంపుకున్నాడు. వేపాకుల్ని బాగా నమిలి ఊసేసి, ఆ తరువాత వేప పుల్లతో పళ్ళు తోమడం ప్రారంభించి కళ్లు మూసుకున్నాడు. నేను మళ్లీ అడిగాను “ఏం చేస్తున్నారు మీరు?” అని. అతనన్నాడు “వేపపుల్ల నా పళ్లపై ఆడుతూ ఉంటే దానిని గమనిస్తూ ఆనందిస్తున్నాను” అని.

అతనిది సాధికారికమైన జీవన ప్రయాణం. ఎందుకంటే! అతను ‘గీత’ లో చెప్పిందే చేస్తున్నాడు కాబట్టి. చెట్టు పైన పండ్లని ఒక పక్షి తింటూ ఉంది. పండ్లని తింటోన్న పక్షిని మరొక పక్షి (కనురెప్ప అర్పకుండా) చూస్తూ బ్రహ్మానందంలో ఉంది. తింటోన్న పక్షి జీవాత్మ అయితే, దానిని చూస్తోన్న పక్షి పరమాత్మ. (నిజానికి అక్కడ రెండు పక్షులు లేవు. ఉన్నది ఒకే ఒక పక్షి. ఏక కాలంలో రెండు వ్యక్తీ కరణలు అసాధ్యం. అంచేత అద్వైత్వాన్ని ద్వైతంగా విభజించడం ప్రకటించడం దృష్ట్యా అనివార్యమవుతుంది. విభజన కేవలం సౌలభ్యం కోసమే). ఇక్కడ తినడం అంటే! కర్మలు చేయడం. చేసే వాడిని చూడటం, వినే వాడిని వినటం. గమనించే వాడిని గమనించటం, ప్రాథమిక ప్రామాణిక ధ్యానం. ఎంతో ఇష్టంతో, పరిపూర్ణ ప్రేమతో, పూర్తి ఎరుకతో కూడిన జీవన యాత్ర సాగుతోన్నపుడు మాత్రమే ఈ ప్రక్రియ అనుభవంలోకి వస్తుంది. అప్పుడు సముద్రంలో నది కలిసిపోయినట్లుగానే జీవాత్మ అనబడే చిన్ని కాలువ పరమాత్మ అనబడే మహా సాగరంలో కలిసిపోతుంది. అదే అసలు యోగం. అప్పుడు మిగిలి ఉండేది నిరాకార, నిర్మలానంద, బ్రహ్మానంద జగత్తు మాత్రమే.

రచయిత సెల్ : 9493430130

ఎన్నిటికో తొలిపాదు

‘స్వర్గసీమ’

తెలుగు చలనచిత్ర రంగంలో ‘స్వర్గసీమ’ సినిమాకు ఎంతో ప్రాధాన్యం వుంది. బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి (బి.ఎన్.రెడ్డి) దర్శకత్వంలో 1945లో వచ్చిన సినిమా ఇది. మొట్టమొదటి సారిగా అంతర్జాతీయ చిత్రోత్సవంలో ప్రదర్శించిన తొలి సినిమా ఇది. వియత్నామ్‌లో జరిగిన అంతర్జాతీయ చిత్రోత్సవంలో దీనిని ప్రదర్శించారు. ఘంటసాల వేంకటేశ్వరరావును మొట్టమొదటిసారిగా గాయకునిగానూ, సంగీతదర్శకునిగానూ పరిచయం చేసిన చిత్రమిది. అలాగే ఈ చిత్రానికి కథని రచించిన చక్రపాణి సినీ రచయితగా మొదటిసారి ఈ చిత్రం ద్వారానే పరిచయమయ్యారు. మంచి నటిగా, గాయనిగా భానుమతికి పేరు తెచ్చిపెట్టిన చిత్రంగానూ ‘స్వర్గసీమ’ ప్రసిద్ధి చెందింది. మరో విశేషమేమంటే ఈ సినిమాలో నాగయ్య కూతురు పాత్రను బి.ఎన్.రెడ్డి కూతురు బేబీ జయలక్ష్మి, నాగయ్య కొడుకు పాత్రను బి.ఎన్. రెండో కుమారుడు మాస్టర్ వేణు పోషించారు. ఈవిధంగా అనేక ప్రత్యేకతలున్న ‘స్వర్గసీమ’ చూడటం ఒక ప్రత్యేక అనుభవం.

ఉత్తమ పురుష దృష్టికోణం

కథను ఉత్తమ పురుష దృష్టికోణం నుంచి కుడా ఆవిష్కరించవచ్చు. ఇందులో కథకుడు తన్ను తాను ‘నేను’ అని ప్రస్తావించుకుంటూ ఉంటాడు. కథనం ద్వారా తన్ను తాను అర్థం చేసుకోవాలని ప్రయత్నిస్తున్న పాత్ర ప్రధానంగా ఉన్న నవలలకూ, ఒకే పాత్ర ప్రధానంగా ఉన్న నవలలకూ ఈ దృష్టికోణం బాగా నప్పుతుంది.

ఉత్తమ పురుష దృష్టికోణం నుంచి సాగిన నవలలో కథనమూ, వ్యాఖ్యానమూ కూడా కథకుడే చేస్తాడు. అంటే కథను చెప్పుకుంటూ, పాత్రల్ని గురించి, సంఘటలన్ని గురించి తన అభిప్రాయాన్ని చెప్పుకుంటూ వెళ్తాడు. ఇలాంటి కథనంలో కథకుడికి, అతణ్ణి సృష్టించిన రచయితలకూ తేడా ఉండవచ్చు. కానీ నవలలోని అన్ని పాత్రలూ కథనానికి పనికిరావు. కథను చెబుతూ , కథను గురించి వ్యాఖ్యానం చేయగల ‘చైతన్యం’ అన్ని పాత్రలకూ ఉండే అవకాశం లేదు. ఈ సూత్రానికి వ్యతిరేకంగా విలియమ్ ఫాక్నర్ అన్న అమెరికన్ రచయిత ‘ది సౌండ్ అండ్ ది ఫ్యూరీ’ అన్న నవలలో ఆలోచించడం చేతకాని ఒక బుద్ధిహీనునిచేత కొంత కథ చెప్పించాడు.

ఉత్తమ పురుషలో కథ చెబుతున్న పాత్ర నవలలోని ప్రధాన పాత్రగా వుండవచ్చు లేదా నవలలోని సంఘటనల్లో సాధ్యమైనన్ని ఎక్కువ సంఘటనల్ని చూసే అవకాశం ఉన్న ఇతర పాత్ర కూడా కావచ్చు.

- వల్లంపాటి వెంకటసుబ్బయ్య

జోక్స్ కార్నర్

వికారనామ సంవత్సరమా?

ఓ పెద్ద మనిషి ఒకసారి విశ్వనాథ సత్యనారాయణ గారిని ఈవిధంగా అడిగారట...

"మీరు చాలా వికారంగా మాట్లాడుతారు. వికారనామ సంవత్సరంలో పుట్టారా?"

"లేదు మన్మథలో. నువ్వు 'ఖర' (వాడి, వేడి గలది)లోనా" అని తిప్పి కొట్టారట విశ్వనాథ గారు.

అచ్చతెనుగు అనువాదాలు



రైల్వే సిగ్నల్ – ధూమ శకట గమనాగమన సూచి

విలేజ్ లెవల్ వర్కర్ – గ్రామ సమమట్టపు పనివాడు

కలెక్టర్ – మండలకర గ్రాహి

రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ – గుండ్రని బల్ల సమావేశం

కోల్డ్ ఐ – శీతకన్ను

ప్యాకల్టీ క్లబ్ – పేకలు, టీ గల క్లబ్

గెట్ ఇంపోర్టెడ్

మంత్రుల సాధారణ పరిజ్ఞానంపై ఛలోక్తులు అనేకం. వాటిలో ఒకటి – ఒక మంత్రిగారు ఆపరేషన్ కోసం సిద్ధమయ్యారు.

డాక్టర్ "లోకల్ ఎనస్తీషియా ఇవ్వమంటారా?" అన్నాడు.

వెంటనే సదరు మంత్రి "వై లోకల్? గెట్ ఇంపోర్టెడ్" అన్నారు.

పిడికెడు ఆకాశం ఏమిటి?

గొల్లపూడి మారుతీరావు గారు సినీ నటులు, నాటక రచయిత. ఆయన ఒకసారి సెకండ్ హ్యాండ్ బుక్‌షాపుకి వెళ్ళారు. తను రాసిన 'పిడికెడు ఆకాశం' పుస్తకం కనిపించగానే తీసుకొని చూస్తున్నారు–

పొరపాట్న ఎవరికయినా ప్రేమగా రాసిస్తే ఇలా అమ్మేసుకున్నాడా అని. కాస్సేపటి తర్వాత షాపాయన – "చాలా సేపట్నుంచి చూస్తూ నిలబడ్డారు. ఆ పుస్తకం తీసుకుపోండి సార్. డబ్బులివ్వక్కర్లేదు. పిడికెడు ఆకాశం ఏమిటి సార్. బొత్తిగా తెలుగు భాష రాని రచయితలాగున్నాడు. పిడికెడు బియ్యం అనాలి లేదా నీలి ఆకాశం అనాలి గానీ" అన్నాట్ట!

బారు పెట్టినవాడు బీరు పోయడా!

జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిని తెలుగులో ప్యారడీ బ్రహ్మ అని చెప్పాలి. శ్రీశ్రీ కవితలెన్నిటికో పేరడీలు రాశారు. అలాగే కొన్ని సామెతలకు పేరడీలు చెప్పారు. సమకాలీన సమాజ పోకడలకు అద్దం పట్టే పేరడీలివి:

1. నవ్వే కవిని ఏడ్చే కార్టూనిస్టును నమ్మకూడదు.
2. తిరిగి సబ్ ఎడిటర్, తిరగక రిపోర్టరు చెడతారు.
3. తంతేపోయి బారులో పడ్డట్టు
4. బారు పెట్టినవాడు బీరు పోయడా?
5. దొంగలను కొట్టి పోలీసులకు వేసినట్టు
6. కోడలికి చెవులుంటాయని అత్తగారి భయం

భమిడిపాటి రామగోపాలం చెణుకులు

నిరాశ: నిడదవోలు రాజేశ్వర శర్మ

అత్యాశ: అనిపిండి త్యాగరాయ శర్మ

మపాసా: మల్యాల పార్థసారథి

పికాసో: పిళ్ళా కామేశ్వర సోమయాజులు

నానా నరక సమాజం: నారాయణపురం నాటక నవలా రచయితల కథకుల సమాజం

చక్కగా ప్లాన్ చేసుకుంటే

దైనందిన జీవితంలో ప్రతిరోజూ పనుల హడావుడి తప్పదు. చక్కగా ప్లాన్ చేసుకుంటే హడావుడి, హైరానా పడవలసిన అవసరముండదు. అనవసరమైన ఒత్తిడీ ఉండదు.

ప్రతి ఆదివారం తర్వాత వారం అంతా ధరించే దుస్తులను, వంటకు కావాల్సిన కూరగాయలు, టిఫిన్ కొరకు పిండులను సిద్ధం చేసుకోవాలి. ధరించే దుస్తులను కూడా ఐరన్ చేసుకుని రెడీగా ఉంచుకోవాలి. లేకపోతే ఏరోజుకారోజు ఏమి చేసుకోవాలి అనే ప్రశ్న తలెత్తుతుంది. అందుకే వారం రోజులకు సరిపడ వస్తువులను అందుబాటులో ఉంచుకోవాలి. ప్రతి రోజూ రాత్రి సాధ్యమయినంతవరకు కూరగాయలను తరిగి పెట్టుకుంటే మంచిది. దీని వలన పొద్దున పూట హడావుడి ఉండదు. ఉదయాన్నే వంట గదిలోకి వెళ్ళి వేటిని వెతుక్కోకుండా అన్నింటినీ ముందుగా ఏర్పాటుచేసి పెట్టుకోవాలి.

వంట గదిలో ఎప్పుడూ పెన్నూ, చిన్న పుస్తకాన్ని ఉంచుకోవాలి. ఏ వస్తువైనా అయిపోయినపుడు వెంటనే రాసిపెట్టుకుంటే షాపింగ్‌కి వెళ్ళినప్పుడు తెచ్చుకోవడం సులభమవుతుంది. వారం రోజుల మెనూను పద్ధతిగా రాసుకుంటే షాపింగ్‌కు వెళ్ళినప్పుడు అవసరం అయినవి కొనుక్కోవచ్చు. ఓ కాగితాన్ని కలాన్ని ఎల్లవేళ్లలా వెంట ఉంచుకుంటే కొద్దిపాటి విరామం ఏదయినా దొరికినప్పుడు లేదా గుర్తుకొచ్చినప్పుడు చేయాల్సిన పనుల జాబితాను రాసుకోవచ్చు. ఇంటి ఖర్చుల తాలూకూ బిల్లులన్నింటిని నెలకు ఒకేసారి చెల్లించేస్తే వాటి గురించిన ఆలోచనలు వేదించవు, విసిగించవు.

ప్రతి పనికి కొన్నాళ్ళ పాటు పద్ధతిగా, సమయపాలన పాటిస్తూ చేస్తుంటే అవి అలవాటుగా మారతాయి. ఏ టెన్షనూ లేకుండా పనులు ముగుస్తాయి. అందుకే పనులన్నింటినీ చక్కగా, పక్కాగా ప్లాన్ చేసుకోండి మరి.

నెమలీక

నీడ ఏది?

సైకిల్ అబ్బాయి నీడ ఏది?

చదువుకున్న మూర్ఖుడు

ఎంత చదువు చదువుకున్నా సమయస్ఫూర్తితో కూడిన తెలివితేటలు లేనివారికి ఆ చదువు నిరర్ధకమే. దానివలన లాభం పొందక పోవడమే గాక, ప్రమాదాన్ని కూడా కొని తెచ్చుకుంటారు.

పూర్వ ఒక గ్రామంలో గార్గుడనే వాడు వుండేవాడు. అతడు మంచి విద్యావంతుడు. పొట్టకూటికి ఎన్నో పనులు చేశాడు. కాని తన పొట్ట తాను నింపుకోలేక పోయేవాడు.

ఒక మిత్రుని సలహా అడిగితే, అతడు ఒక సలహా ఇచ్చాడు. అది ఏటంటే అరణ్యం మధ్యలో ఓ పెద్ద చెట్టు ఉంది. దాని ఆకులతో వైద్యం చేస్తే ఎట్లాంటి జబ్బైనా నయమవుతుంది. దాన్ని తీసుకువచ్చే నువ్వో మంచి వైద్యుడిగా పేరుపొందొచ్చు. తద్వారా నీ ఆదాయం పెరిగి హాయిగా జీవించొచ్చు అయితే దాన్ని గుర్తించడం కొంచెం కష్టం. ఆ చెట్టు ఆకులు ఎప్పటికీ వాడిపోవు. ఈ విషయం గుర్తుంచుకుని ఆ చెట్టును కనిపెట్టి తీసుకురా అని చెప్పాడు.

ఎంతో కష్టపడి ఆ చెట్టును గుర్తించాడు గార్గుడు. సంతోషంతో ఆ చెట్టు ఆకులను పెద్దమొత్తంలో కోసి మూటగట్టుకున్నాడు. ఆనందంగా ఇంటికి బయల్దేరాడు.

ఇంటికి వచ్చే దారి మధ్యలో పెద్ద అడవి ఉంది. ఆ అడవిగుండా వెళ్తుంటే ఒక గుహ ముందు చనిపోయిన పులి కనిపించింది. వెంటనే తన దగ్గరున్న ఆకు పసురు పరీక్షించదలచుకున్నాడు గార్గుడు. అంతే... మందు వెనుకలు ఆలోచించకుండా, భద్రంగా దాచుకున్న ఆకులను తీసి వాటిని చేతులతో నులిమి ఆ వచ్చిన రసాన్ని పులి మృతకళేబరంపై చల్లాడు.

ఆ పసరు చల్లగానే నిద్ర పోయి లేచినట్లుగా పులి లేచి నుంచుంది. ఆకలితో ఉన్న పులి భయంకరంగా గర్జిస్తూ ఎదురుగా ఉన్న గార్గుడిపై లంఘించింది. తన వాడి గోళ్లతో అతనిని చీల్చి తనివి తనివితీరా తిన్నది.

కళ్ళులేని వారికి అద్దం ఉపయోగపడనట్లే ఆలోచన లేని వారికి శాస్త్రం సహాయ కారి కాలేదు. పని ప్రారంభించే ముందు మంచి చెడులను ఆలోచించి మొదలు పెట్టాలి. అవి ఏవీలేకుండా పులిపై ఆకుపసరు పిండాడు గార్గుడు.

ఎలా ఆలోచించినా మనిషి అభివృద్ధికి మూలం బుద్ధి.. ఆ బుద్ధి తగిన ఫలములు ఇచ్చు కల్పవృక్షం. అదే స్నేహితుడు. అదే చుట్టం.

కాని మతిహీనులు చేవలేని చెట్లలాంటివారు. ఒక్కోసారి కొందరిపై నమ్మకముంచాలి. నమ్మకం లేనివారు బతుకలేరు. పాము కరిస్తే చస్తావని చెప్పినప్పుడు పరీక్షించి చూడాలనకునేవాడు. వెర్రివాడు, అలాంటి వాళ్లని ఎవరూ బాగుచేయలేరు.

ఆ ఒక్కటి!



ఇక్కడున్న ఆరు గొంగళిపురుగుల్లో ఒకటి మిగతావాటితో కలవదు. అది ఏదో గుర్తించండి.

లెక్కల్లో ఎక్కాలు

మీకు ఎక్కాలు బాగా వచ్చా? వస్తే 12వ ఎక్కం గడగడా చదవండి. చదువుతూ ఇక్కడున్న ఖాళీలు పూర్తి చేయాలిమరి!



దారేది?

ఈ తేనెటీట పువ్వు దగ్గరికి చేరాలంటే ఏ దారిలో రావాలో చెప్పుకోండి.



రంగులు వేద్దాం



తేడాలు వున్నాయా?

చూడ్డానికి ఒకేలా కనిపిస్తున్న ఈ రెండు బొమ్మల్లో కొన్ని తేడాలున్నాయి. అవి ఎన్నున్నాయో, ఎక్కడెక్కడ ఉన్నాయో కనిపెట్టండి.

■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

పారిస్, 1845

ఇంగ్లండు నుండి జర్మనీకి తిరిగివెళుతూ పారిస్‌లో ఆగాడు ఎంగెల్స్. క్రితం సంవత్సరం రూగ్ పత్రికకు, పొలిటికల్ ఎకానమీ గురించి ఒక అద్భుతమైన ఆర్టికల్ రాసిన వ్యక్తిగా, అప్పటికే అతడి పేరు మార్క్స్‌కు తెలుసు. 'రైనిష్ జైటుంగ్' నడుపుతున్న 'నియంత' ఎవరో ఎంగెల్స్‌కూ తెలుసు. అయినా మార్క్స్ రచనలంటే అతడికి చాలా ఇష్టం. ఆగస్టు 28, 1844 నాడు కెఫెడిలా రీజెన్స్‌లో సమావేశమైన ఇద్దరూ పది పగళ్లు, పది రాత్రులు విరామం లేకుండా మాట్లాడుకున్నారు. మామూలుగా అక్కడ చదరంగం క్రీడాకారులు కలుస్తుంటారు. ఆ రకంగా వీళ్లిద్దరి సమావేశానికది సరైన వేదికే.

ఇరవై మూడేళ్ల ఎంగెల్స్ సన్నగా, పొడుగ్గా మంచి డ్రెస్సు వేసుకొని హుందాగా ఉన్నాడు. తండ్రి ఫ్యాక్టరీ యజమాని. ఆయన సూచనతో, పదిహేడో ఏట చదువు ముగించి, ఫ్యాక్టరీ వ్యవహారాలలో మునిగిపోయాడు. ఆహార్యంలో అతనికీ, మార్క్స్‌కూ పోలికే లేదు – తాగుడులో తప్ప. మార్క్స్‌ను చూసి అతడెలాంటివాడో సులభంగా తెలుసుకోవచ్చు. కాని ఎంగెల్స్ అలా కాదు. పైకి, అతడు ఘరానా మనిషి. షైలాపచ్చీసుగా తిరిగే పడుచు కుర్రాడు. కాని ఆయన లోపలి విప్లవ భావాలను, మేధో పరిణితిని పసిగట్టడం ఓ పట్టాన సాధ్యపడదు. అప్పటికే ఒక ఐరిష్ ఫ్యాక్టరీ యువతితో సహజీవనం గడుపుతున్నాడు. ఇంకా, ఇరవైఏళ్లు కూడా నిండనప్పుడే అనియంత్రిత పారిశ్రామికీకరణ వల్ల కలిగే సామాజిక దుష్ఫలితాల గురించి వార్తా పత్రికల్లో ఘాటైన వ్యాసాలు రాశాడు. అలాంటి ఈ విప్లవ యువకుడు ఆగస్టులో మార్క్స్‌ను కలిశాడు. మార్క్స్, అతడి అభిప్రాయాలనూ, 'అలవాట్లనూ' పూర్తిగా ఆమోదించాడు.

ఫ్యాక్టరీ యజమానిగా ఎంగెల్స్‌కు పెట్టుబడిదారీ మనస్తత్వం, వ్యాపార రహస్యాలు పూర్తిగా తెలుసు. అయినప్పటికీ తన విప్లవ నిబద్ధతతో అదే వ్యవస్థ సృష్టిస్తున్న అసమానతలను, దుష్ఫలితాలను ఎండగడుతూ విశ్లేషణాత్మకంగా, ఘాటైన వ్యాసాలు కూడా రాయగలడు. పారిశ్రామికీకరణ పరిణామాలను కూలంకషంగా అవగాహన చేసుకున్నాడు ఎంగెల్స్. పెట్టుబడిదారుల మనస్తత్వాన్ని, వాళ్ల కుట్రలను మార్క్స్‌కు తెలియజెప్పటానికి వచ్చిన దూత తాను.

ఇరవై ఆరేళ్ల మార్క్స్ మేధో పటిమ, వ్యక్తిత్వం చూసి 'ఇలాంటివారి పరిచయమే మహద్భాగ్యం' అనుకున్నాడు ఎంగెల్స్. తన భావాలకు చేయూతనిచ్చే వ్యక్తి, తన కృషిలో భాగస్వామి ఒకరు కావాలి. ఆ అరుదైన వ్యక్తి మార్క్స్ తప్ప మరెవరూ కాలేరని తెలిసిపోయింది. 'అన్ని సైద్ధాంతిక విషయాలపైన ఏకాభిప్రాయం కుదిరింది. మా సమిష్టి కృషి ఆ క్షణం నుండే ప్రారంభమైంది' అంటూ తన చారిత్రక సమావేశాన్ని వర్ణించాడు ఎంగెల్స్. అంతేనా, ఆర్థిక సమస్యలతో నిరంతరం కొట్టుమిట్టాడిన మార్క్స్‌ను మునిగిపోకుండా ఆదుకున్నాడు. ఎంగెల్స్ లేకపోతే, మార్క్స్ కృషి కొనసాగేదే కాదు. ఆ కుటుంబ మనుగడే ప్రశ్నార్థకంగా మారినప్పుడు 'నేనున్నాన'ని నిల్చిన రక్షకుడు ఎంగెల్స్.

పద్దెనిమిదవ శతాబ్దంలో ప్రష్యాలోని వుప్పెర్టాల్ ప్రాంతంలో జౌళి (textile) వ్యాపారం ప్రారంభించాడు ఎంగెల్స్ ముత్తాత. ఆ తర్వాత రైన్‌లాండ్ (జర్మనీలోని పశ్చిమ ప్రాంతం)లో పారిశ్రామికాభివృద్ధి ఎక్కువగా జరిగిన నగరంగా గుర్తింపు తెచ్చుకుంది. అక్కడి బార్మెన్ (నగరం). వుప్పెర్ నది పారిశ్రామిక వ్యర్థాలతో కలుషితమై, నీళ్ల రంగు కూడా మారిపోయింది. మత ఛాందసత ఎక్కువగా ఉన్న కుటుంబంలో గడిచింది ఎంగెల్స్ బాల్యం. పిల్లలు కూడా మత గ్రంథాలు మాత్రమే చదవాలి. వినోదాలకు దూరంగా వుండాలి. ఈ నిర్బంధాన్ని సహించలేని ఎంగెల్స్, పదిహేనవ ఏటకే తిరుగుబాటు చేశాడు. తండ్రి శిక్షించినా లాభం లేకపోయింది. 'కథల పుస్తకాలు కూడా చదువుతున్నాడు కుర్రాడు. దేవుడే వాణ్ణి రక్షించాలి' అంటూ వాపోయాడాయన.

స్కూల్లో ఉన్నప్పుడు కవిత్వం పట్ల కొంత శ్రద్ధ కనపర్చాడు ఎంగెల్స్. పదిహేడో ఏట కొన్ని గీతాలు అచ్చయ్యాయి. సాహిత్య జీవితం గడపాలని కూడా అనుకున్నాడు. కాని తండ్రి అతణ్ణి వ్యాపార బాధ్యతలు తీసుకొమ్మని ఒత్తిడి చేశాడు. స్కూలు మాన్పించాడు. ఆ తర్వాత, ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌గా చేరిన తర్వాత ఎంగెల్స్‌కు తిరుగుబాటు భావాలు ఎక్కువయ్యాయి. మొదట, తన మిత్రుల్నీ, సహోద్యోగుల్నీ మీసాలు పెంచాలని ఒత్తిడి చేశాడు (ఆ రోజుల్లో మర్యాదస్తులు మీసాలు పెంచటం మర్యాదు కాదు!). చేతులకు గ్లోవ్స్ వేసుకోరాదు. ఇంకా ఇలాంటివి ఎన్నో. మొత్తం మీద, ఇన్నాళ్లూ నామకంగా వున్న అతణ్ణి వూర్లో అందరూ గుర్తుపట్టారు. ఆడపిల్లలకు ఈ పద్ధతులు నచ్చాయి.

అయితే, అతడి నిజమైన నిరసన లేఖల రూపంలో కొనసాగింది. 'ఫ్రెడ్రిక్ ఆస్వాల్డ్' పేరుతో 'లెటర్స్ ఫ్రం వుప్పెర్టాల్' ప్రచురితమై పెద్ద దుమారం లేపింది. పద్దెనిమిదేళ్ల ఎంగెల్స్, ఆరేళ్ల బాల కార్మికులు విష వాయువులు పీలుస్తూ ఫ్యాక్టరీలలో ఎలా పని చేస్తున్నారో, ఎలా తాగుడుకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారో సోదాహరణంగా వివరించారు.

'వుప్పెర్టాల్‌లోని కార్మికుల పరిస్థితి అత్యంత దయనీయం. ఇంచుమించు అందరూ సిఫిలిస్‌తో, వూపిరితిత్తుల జబ్బులతో బాధపడుతున్నారు. ఒక్క ఎబెర్‌ఫెల్డ్ (నగరం)లోనే అక్కడున్న 2500 మంది బాలబాలికలలో సగానికి సగం మంది ఫ్యాక్టరీలలో పని చేస్తున్నారు. ఫ్యాక్టరీ యజమాని పెద్దవాళ్లకిచ్చే కూలీలో సగం మాత్రమే బాల కార్మికులకిచ్చి పని చేయించుకుంటాడు. ఈ పాప ప్రక్షాళన కోసం, యజమానులు తప్పనిసరిగా చర్చికి వెళ్లి ప్రార్థనలు చేస్తారు.

కొందరు యజమానులు, కార్మికులకు తాగుడు మాన్పిస్తామనే మిషతో కూలీ రేట్లు తగ్గించారు.

'మహిళలకు విముక్తి కలిగితే తప్ప మానవ జాతికి విముక్తి లేదు' అని కూడా వాదించాడు. 'ఆస్వాల్డ్' మరొక మిత్రుడికి రాసిన లేఖలో 'జర్మన్ ప్రభువు విల్హెల్మ్ విల్హెమ్ III అంటే నాకసహ్యం. ఇతడితో పోల్చితే, నెపోలియన్ సత్పురుషుడే. ప్రజలు ఎడాపెడా వాయిస్తే తప్ప ఏరాజూ బుద్ధిగా పరిపాలించలేదు. విప్లవ నినాదాల హోరులో, వాళ్ల ఏడంతస్తుల మేడలకు పగుళ్లు పడితే తప్ప ప్రజలకు న్యాయం జరగదు' అని రాశాడు.

1841లో అప్రెంటిస్‌షిప్ ముగించుకుని ఓ ఏడాదిపాటు మిలిటరీ సర్వీసు చెయ్యటానికి బెర్లిన్ వెళ్లాడు ఎంగెల్స్. అయితే, అక్కడికెళ్లటానికి అసలైన కారణం యూనివర్శిటీలోని 'యంగ్ హెగెలియన్ల' సాంగత్యంలో గడపటానికి అప్పటికే అతడు ప్రచురించిన ముప్పై మూడు వ్యాసాలు వాళ్లకు నచ్చాయి.

ఆ కాలంలో ఎంగెల్స్‌ను ప్రభావితం చేసిన ఒక వ్యక్తి (మార్క్స్ మిత్రుడు) మోజెస్ హెస్ – కమ్యూనిజంను ప్రచారం చేసిన తొలి తరం రాడికల్. 'విప్లవం అనివార్యం. ఫ్రాన్స్, జర్మనీ, ఇంగ్లండుల నుండి అది వస్తుంది – రాజకీయంగా ఫ్రాన్స్, తాత్విక ప్రాతిపదికగా జర్మనీ, ఆర్థిక కారణాలలో ఇంగ్లండు విప్లవ కేంద్రాలు' అని నమ్మాడు. యాదృచ్ఛికమే కావచ్చు గాని తర్వాతి రోజుల్లో అతను ఇంగ్లండుకే వెళ్లవలసి వచ్చింది.

1837లో, ఎంగెల్స్ తండ్రి, ఎర్మెన్ సోదరులతో కలసి, మాంచెస్టర్‌లో జౌళి మిల్లులు ప్రారంభించి, కొడుకును కూడా అదనపు ట్రెయినింగ్ కోసం అక్కడికే వెళ్లమన్నాడు. అప్పటికి ప్రపంచ పారిశ్రామిక కేంద్రం మాంచెస్టర్ (ఇంగ్లండు). అక్కడ, ఎర్మెన్ సోదరుల 'విక్టోరియా మిల్స్'లో శిక్షణ తీసుకోవాలి ఎంగెల్స్. ఇంతకన్నా మంచి అవకాశమేముంది! ఒక ఎంగెల్స్ వ్యాపార రహస్యాలు వంటబట్టించుకుంటాడు. మరొక ఎంగెల్స్ (విప్లవకారుడు) వ్యవస్థను కూలదోయటమెలాగో నేర్చుకుంటాడు. కొలోన్‌లో 'రైనిష్ జైటుంగ్' సంపాదకుణ్ణి (మార్క్స్) కలిసినప్పుడు ఎంగెల్స్‌తో మాట్లాడటానికే ఆసక్తి చూపలేదు మార్క్స్. అందువల్ల వాళ్ల పారిస్ సమావేశమే మొదటిదని అనుకోవచ్చు.

1842 నవంబర్‌లో ఎంగెల్స్, మాంచెస్టర్‌లో అడుగుపెట్టే నాటికి, జీతాలలో కోతకు నిరసనగా జరిగిన సమ్మెల నుండి అప్పుడప్పుడే కోలుకుంటున్నది నగరం. వాతావరణం ఉద్రిక్తంగా ఉంది. కార్మికులు అత్యంత పీడిత వర్గమే కావచ్చు గాని, బ్రిటిష్ రాజ్యాంగం వాళ్లకు గ్రూపులుగా ఏర్పడగలిగే హక్కు కల్పించింది– ఇదే వాళ్ల ఆశాకిరణం. అయితే అదంత సులభమేమీ కాదు. ఒక సామాజిక కార్యకర్త రాసినట్టుగా 'ధనిక, పేదల మధ్య అంతరం ఇక్కడున్నంత ఎక్కువగా మరెక్కడా లేదు'. కాని ఆ అంతరాన్ని అధిగమించటానికి ఎంగెల్స్‌కి ఒకరు తోడ్పడ్డారు. తనే పొందొమ్మిదేళ్ల ఐరిష్ యువతి మేరీ బర్న్స్. ఆమె, తన పదిహేడేళ్ల చెల్లెలు లిడియా (లిజ్జీ) ఎంగెల్స్ ఫ్యాక్టరీలో కార్మికులు. వాళ్లిద్దరికీ ఎలా పరిచయమైందో సరిగ్గా తెలియదుగాని, మొదటి చూపులోనే ఎంగెల్స్‌ని ఆకర్షించింది మేరీ. ఆమె ద్వారా మాంచెస్టర్‌లోని నరులుండే నరకలోకాన్ని దర్శించాడు ఎంగెల్స్. ఆనాటి ఐరిష్ ఫ్యాక్టరీ కార్మికులతో పోలిస్తే నరకంలోనైనా మనుషులు సులభంగానే ఉండగలరేమో! అక్కడ పారిశుధ్యం ఆనవాలు కూడా లేదు. మూత్రపు మడుగుల్లో జంతువులు కుళ్లిపోతున్నాయి. ఎక్కడ చూసినా పందుల కొట్టాలే. చీలమండల లోతు బురదలో నడవ దలచుకుంటే తప్ప అక్కడికి వెళ్లకూడదు. 'మనుషులెలా వుంటున్నారిక్కడ?, ఎలా ఉండగలుగుతున్నారు?' అని ఆశ్చర్యపోయాడు ఎంగెల్స్.

ఆశ్చర్యపడినంత మాత్రాన పరిస్థితి మారదు. తన తండ్రి ఫ్యాక్టరీ, ఇతర ఫ్యాక్టరీలలో పని చేసేవాళ్లంతా అక్కడే ఉంటున్నారు. వీళ్లు సృష్టించిన సంపదతోనే వాళ్లు విశాలమైన భవనాలలో విలాసవంతమైన జీవితం గడుపుతున్నారు. ఆ క్షణాన ఎంగెల్స్‌కు అర్థమైందొక్కటే. బానిసల్ని ఒకేసారి అమ్మేస్తారు. వీళ్లు తమను తాము రోజూ అమ్ముకుంటున్నారు. కార్మికులు నిర్మించిన యంత్రాలు, ఫ్యాక్టరీలు, తమ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉపయోగపడుతున్నాయి. తమ సృష్టి తమనే కబళించి వేస్తుంది. ఈ పరిస్థితి మారాలి.

మేరీ ద్వారా పలువురు ఐరిష్, బ్రిటిష్ రాడికల్స్‌తో పరిచయమైంది. ఈ అమానవీయ పరిస్థితులు ఎంగెల్స్‌లో అసహనం పెంచాయి. ఏదో చెయ్యాలి. మార్పు రావాలి. ఏదైనా తక్షణమే జరగాలి. బ్రిటిష్ పత్రికలలో జర్మన్ కార్మికుల స్థితిగతుల గురించీ, జర్మన్ పత్రికలలో బ్రిటిష్ కార్మికుల గురించి వ్యాసాలు రాశాడు. వీటిలో ఐదు ఆర్టికల్స్‌ను, 1842లో 'రైనిష్ జైటుంగ్'లో (రచయిత పేరు 'X' అని మాత్రమే ఉంటుంది) ప్రచురించాడు మార్క్స్. ఇంగ్లీష్ పత్రికలకు పంపిన వాటికి మాత్రం 'ఎఫ్. ఎంగెల్స్' అని సంతకం చేశాడు.

1843 నాటికి ఎకనమిక్స్, పాలిటిక్స్, హిస్టరీ గురించిన ఇంగ్లీష్ రచయితల గ్రంథాలన్నింటినీ అధ్యయనం చేశాడు ఎంగెల్స్. ఈ అధ్యయన ఫలితమే 25 పేజీల 'outlines of a critique of political economy'. మార్క్స్ సంపాదకత్వం వహించిన రూగ్ పారిస్ పత్రికలో 1844లో ప్రచురితమైంది. బహుశా, అదే, అప్పుడు ఆవిర్భవిస్తున్న పెట్టుబడిదారీ వ్యవస్థను అభిశంసించిన తొలి 'మార్క్సిస్టు' రచన అయి వుంటుంది. 'ఫ్యాక్టరీ యజమానులు కొన్నిసార్లు ఉత్పత్తి పెంచి, మరికొన్నిసార్లు తగ్గించి (ఆ నెపంతో జీతాలలో కోతపెట్టి) సామాజిక అసమానతలను సృష్టించి, వర్గ సంఘర్షణకు దారితీసే పరిస్థితులను సృష్టిస్తున్నారు' అంటాడు ఎంగెల్స్ ఈ వ్యాసంలో. శ్రమ తగ్గించే యంత్రాల వల్ల కార్మికుల శ్రమ ఏమీ తగ్గలేదు. పైగా, నిరుద్యోగం పెరిగింది. ఫ్యాక్టరీలో కార్మికుల సంఖ్య తగ్గింది గనుక, వున్నవాళ్లు అదనంగా శ్రమించక తప్పటం లేదు. ఈ వ్యవస్థలో, పెట్టుబడిదారుకు లాభం అంటే కార్మికుడికి నష్టం' అన్నమాటే.

1844లో మార్క్స్‌ను కలిసేనాటికి, ఎంగెల్స్ కూడా అవే నిర్ధారణలకు వచ్చినా, వాటిని చేరిన మార్గం మాత్రం (మార్క్స్ కన్నా) భిన్నమైంది. ఏదిఏమైనా, ఇక, ముందుకు పోవాలంటే ప్రచారం తప్ప మరో మార్గం లేదనుకున్నారిద్దరూ. జర్మనీకి వెళ్లి, ఇంగ్లండులోని కార్మికుల స్థితిగతుల గురించి పుస్తకం రాస్తానన్నాడు ఎంగెల్స్. (ఇదే మనకు తెలిసిన క్లాసిక్ గ్రంథం (conditions of the working class in England) మార్క్స్ కూడా తను చేసిన అధ్యయనంతో రాజకీయ, అర్థశాస్త్రం (పొలిటికల్ ఎకానమీ) గురించి ఓ పుస్తకం ముగిస్తానన్నాడు. ఆ సెప్టెంబర్‌లో పారిస్ వదిలే నాటికి, తాము ఉమ్మడిగా చేపట్టబోయే మరో పుస్తకం కోసం పదిహేను పేజీల రాజకీయ కరపత్రం ఒకటి తయారు చేశాడు ఎంగెల్స్. తమ మాజీ సహచరుల తప్పుడు ఆలోచనా పద్ధతుల గురించిన విమర్శ అది. ఇదే మార్క్స్, ఎంగెల్స్‌ల తొలి ఉమ్మడి రచన The holy family or critique of critical criticism.

జెన్నీ, పారిస్ చేరుకునే నాటికి, 'కరపత్రం' రాస్తూ బిజీగా వున్నాడు మార్క్స్. అప్పటికి తన భర్తను అంతగా ఉత్తేజపరచిన కొత్త మిత్రుణ్ణి ఆమె చూడలేదు. కాని మార్క్స్, ఈ విరామం లేకుండా, ఎంగెల్స్ తనకు చెప్పిన మాంచెస్టర్ స్థితిగతులను, పెట్టుబడిదారీ విధానపు లోగుట్టునూ, చెబుతూనే వున్నాడు మార్క్స్. సిద్ధాంతమెప్పుడూ వాస్తవ పరిస్థితుల ఆధారంగానే వుండాలన్న నమ్మకం మరింత బలపడింది. ఈ మధ్యనే బ్రూనోబార్ ఓ వ్యాసంలో రాశాడు. 'మనుషులకు దారి చూపిస్తుంది చరిత్ర. అంతేకాని మనుషులు చరిత్ర చోదకులు కారు' అని. జన సామాన్యం పాల్గొన్న ఫ్రెంచి విప్లవం, అనేక సిద్ధాంతాలను తలకిందులు చేసింది. ఈ అవగాహనతో ప్రూధోను విమర్శించటానికి పూనుకున్నాడు మార్క్స్.

ఈ కరపత్రాన్ని వీలైనంత త్వరగా ప్రకటించాలి. కాస్త డబ్బయినా వస్తుంది. ఇదీ, కొలోన్ నుండి జార్జియుంగ్ మళ్లీ పంపిన డబ్బుతో, చింత లేకుండా సంసారం కొన్నాళ్లు గడుస్తుంది. ఫ్రెంచి ప్రభుత్వ సహకారంతో, ప్రష్యన్ ప్రభుత్వం 'ఫార్వర్డ్' పత్రికను నిషేధించగలిగితే, తను అరెస్టును తప్పించుకోలేడు. వీలైనంత త్వరగా రచన ముగించాలి. కాని మార్క్స్ స్వభావం అందుకు సహకరించదు. ఏదైనా పని చెయ్యాలనుకున్నప్పుడు అది ముగించటం అసాధ్యమవుతుంది. నవంబర్‌లోగాని రచన ఓ కొలిక్కి రాలేదు. ఎంగెల్స్ రాసిన పదిహేను పేజీలను మరో మూడు వందల పేజీలు జత గలిపాడు. ఇందులో ఎక్కువ భాగం, ఫ్రెంచి రచయిత యూజీన్ సూ రాసిన ఒక గోతిక్ (హారర్) నవల గురించిన విమర్శ.

(సశేషం)

■ సృజన

జానపదాల జలధి జాలాది

అతని 'కలం' అజరామరం
మనిషిని మనిషిలా చూడటమే 'మానవత్వం'
కుల, మత, ఆర్థిక, లింగ భేదాలకతీతం 'మనిషి'
తెలుగు సినీ జానపద సాహిత్య 'రాజు'
పల్లెపదాల మొనగాడు 'జాలాది'
నేటికీ ఎడతెగక పారు'నది' 'యాతమేసి తోడినా...' పాట.

జాలాది రాజారావు రచించిన ప్రాణం ఖరీదు సినిమాలో 'యాతమేసి తోడినా...' గీతం జీవిత గాయాన్ని మాన్పించే ఓ టానిక్, ఓదార్పు. గుబాళించే పూదోట ఈ పాట. ఎలా ఉంటుందో వినండి...

యాతమేసి తోడినా యేరు ఎండదూ
పొగిలి పొగిలి ఏడ్చినా పొంత నిండదూ
దేవుడి గుడిలోదైనా.. పూరి గుడిసెలోదైనా
గాలి ఇసిరి కొడితే.. ఆ దీపముండదూ...
ఆ దీపముండదు ॥యాతమేసి॥

పలుపుతాడు మెడకేత్తే పాడి ఆవురా
పసుపుతాడు ముడులేత్తే ఆడదాయిరా
కుడితినీళ్లు పోసినా... అది పాలు కుడుపుతాదీ...
కడుపుకోత కోసినా... అది మనిషికే జన్మ ఇత్తాదీ
బొడ్డు పేగు తెగిపడ్డ రోజు తలుసుకో
బొడ్డు కాదు ఆడదనే గుణం తెలుసుకో... ॥యాతమేసి॥

అందరూ నడిసొచ్చిన తోవ ఒక్కటే
సీము నెత్తురులు పారే తూము ఒక్కటే
మేడ మిద్దెలో ఉన్నా... సెట్టునీడ తొంగున్నా...
నిదర ముదర పడినాక
పాడె ఒక్కటే వల్లకాడు ఒక్కటే
కూతనేర్చినోళ్ల కులం కోకిలంటరా
ఆకలేసి అరసినోళ్లు కాకులంటరా ॥యాతమేసి॥

చక్రవర్తి సంగీత సారథ్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆలపించిన ఈ పాట సాహిత్యంలో అభ్యుదయ భావాలు, తాత్విక ఆలోచనలు కన్పిస్తాయి. ఏళ్ల తరబడి వేళ్లూనుకున్న అంతరాలను తన అక్షరాలతో సంధించిన అస్త్రం ఈ గీతం. జానపదాల పలుకుబళ్లు, వారి ప్రతిభకు మచ్చుతునక.

ఏడుపును ఏతంతో పోల్చడం ఓ విశేషం. ఏతం అంటే నీళ్లు తోడటానికి వాడేది. ఇద్దరు వ్యక్తులు ఇటూ ఇటూ పట్టుకుని తట్టతో నీళ్లు తోడతారు. మనిషి బాధను ఏరుగా భావిస్తే... ఏడుపు ఏతమవుతుంది. ఏతమేసి తోడినా ఏరు నిండదంటూ ప్రతీకాత్మకంగా చెప్పారు. ఏడుపును ఏతంతో నీళ్లు తోడినట్లే కళ్లు కన్నీటిని వర్షిస్తాయి.

పొంత అంటే కుండ. కన్నీళ్లతో పొంతను నింపాలనుకోవడం అర్థరహితం. పైగా మనసు తేలిక పడదు. సుఖదు:ఖాల రేయింబవళ్లు. కష్టాలకు అతీతంగా కాపురాలు సాగవు. గుడిలో ఉందా, గుడిసెలో వుందా అన్నది ముఖ్యం కాదు. గాలి విసిరి కొడితే దీపం ఉండదు. ఇది పరమసత్యం. ఈ ఒక్క ఉపమానంతో కష్టాల సామ్యవాదాన్ని కళ్లకు కట్టారు.

అమ్మకు ఆవుకు వర్ణమాలతో పరిచయం చేసినట్టు, అమ్మకు ఆవుకు పోలిక పెట్టారు. ఆవును అదుపులో పెట్టడానికి మెడలో పలుపు తాడు వేస్తారు. స్త్రీ ఒకరికి సొంతమైందని చెప్పడానికి పసుపుతాడు కడతారని, కుడితినీళ్లు పోసినప్పుడు ఆవు పాలు ఎలా ఇస్తుందో, స్త్రీ కూడా కడుపు కోసి (శస్త్ర చికిత్స) కన్నీళ్లు పెట్టించినా సరే మనిషికి జన్మనిస్తుంది. నిస్వార్థతకు పర్యాయపదం నారి. అలాంటి ఆమెను బాధపెట్టి బావుకునేదేంటని అంటాడు కవి.

ఉన్నోళ్లు, లేనోళ్లు, ఉన్నత కులాలు, నిమ్నజాతులు ఎన్ని రకాలుగా విడిపోయారో... తల్లి గర్భంలో ఉమ్మనీటిని దాటుకుంటూ అందరూ నడిచొచ్చిన తోవ ఒక్కటే. సీము, నెత్తురు పాడే తూము అంటే శరీరం. అరికాళ్ల నుండి తల వరకు అందరికీ సమానమే కాని మానసిక వికారాలతో వివక్షలెందుకంటారు.

కూతనేర్చినోడు కోయిలగా సత్కారాలు అందుకుంటే, ఆకలితో కేకలేసినోడు కాకిగా ఛీత్కారాలు పొందుతున్నాడని సమాజంపై వ్యంగ్య బాణాలేశారు. కడుపు నిండిన వాడు కూనిరాగాలు తీస్తాడు. ఆకలి కేకలతో అలమటించే అన్నార్తుల వ్యధను మాత్రం 'కాకిగోల'గా అసహ్యించుకుంటారు. ఇందెంతవరకు న్యాయమని ఎండగడతారు కవి.

లక్షల విలువ చేసే అక్షరాలను అందించారు జాలాది. మరొక్కసారి ఈ పాటను వినండి.

– భూపతి వెంకటేశ్వర్లు, 9490098343

ప్రేమ్‌చంద్ ప్రత్యేకత

ప్రేమ్‌చంద్ భారతీయులందరికి పరిచితుడే. ఇంకా చెప్పాలంటే సుపరిచితుడు. ఆయన రాసిన నవలల్లో 'గోదాన్' చాలా పేరు పొందింది. చిన్నా, పెద్దా అన్ని రకాల నవలలు ఉన్నాయి. కథలు రాయడంలో కూడా ఆయనది అందె వేసిన చెయ్యే. సుమారు ఐదు వందల కథలు రాశారు. 'మాన్‌సరోవర్' పేరుతో ఎనిమిది సంపుటాలుగా ఆయన కథలు ప్రచురితమయ్యాయి. అవి కూడా హింది సాహిత్యానికి విలువైన ఖజానాయే. ప్రేమ్‌చంద్ ముందు ఉర్దూలో రాశారు. తరువాత హిందీకి వచ్చారు. ఆయన ఇవి కాకుండా వ్యాసాలు రాశారు. సాహిత్యం, సామాజికం అన్ని రకాలు. మూఢనమ్మకాలు, మత సామరస్యం వంటి విషయాలు కూడా స్పృశించారు. పేదరికం, ఆర్థిక – సామాజిక అణచివేత గురించి చర్చించటమే కాక తన సృజనలో వాటిని చిత్రీకరించారు. ఆయన స్వయంగా కూడా పేదరికాన్ని దగ్గరగా చూసిన వాడే. అ ందుకే పేదల కష్టాన్ని బాగా అర్థం చేసుకోగల్గి తన రచనల్లో కూడా ప్రభావవంతంగా దింపగలిగాడు. ప్రజానాట్యమండలి ఆవిర్భావ సభకి ఆయన అధ్యక్షత వహించడం కాకతాళీయం అనుకోలేం. సమాజం గురించి నిశితమైన అవగాహన ఉండడం వల్ల అది న్యాయమసమ్మతమే అనిపిస్తుంది.



దీనికి కారణం మొదటిది ఆయన నిజాయితీ. ప్రజా పక్షపాతిగా చెప్పిన దాంట్లో మోసం లేకపోవడం. రెండోది నిబద్ధత. పీడిత ప్రజల కష్ట, నష్టాలని అందరి దృష్టికి ఉన్నది ఉన్నట్టు తీసుకురావాలనే ఆయన ఆలోచన. అది ఆయన సాధించాడు కూడా. తన రచనల్లో ఆయన సంఘటనలు, సన్నివేశాలు జరిగినవే రాశాడనిపిస్తుంది.

కాని ప్రేమ్‌చంద్ తాలూకు అసలు సామర్థ్యం ఎక్కడ ఉంది? ఆయన హిందీ లేక భారతీయ సాహిత్యపైన తన చెరగని ముద్ర ఎలా వేయగలిగాడు? అంటే దీనికి కారణం మొదటిది ఆయన నిజాయితీ. ప్రజా పక్షపాతిగా చెప్పిన దాంట్లో మోసం లేకపోవడం. రెండోది నిబద్ధత. పీడిత ప్రజల కష్ట, నష్టాలని అందరి దృష్టికి ఉన్నది ఉన్నట్టు తీసుకురావాలనే ఆయన ఆలోచన. అది ఆయన సాధించాడు కూడా. తన రచనల్లో ఆయన సంఘటనలు, సన్నివేశాలు జరిగినవే రాశాడనిపిస్తుంది. వాస్తవ ఆధారం కాక వాస్తవమే చిత్రీకరించాడనుకోవాలి. కాని ఉన్నది ఉన్నట్టు చూపించినంత మాత్రాన అది సంపూర్ణం ఎలా అవుతుంది? అక్కడే ఆయన మూడో ప్రత్యేకత కనబడుతుంది. అదే ప్రతి రచనకి ఒక సందేశం ఉండడం. పాఠకులు నిజం తెలుసుకుని అక్కడితో ఆగిపోకుండా దానికి సంబంధించి వారికి ఏమైనా పాత్ర ఉందా లేదా అని అనుకునేలా ఆయన రచనలు ముగిస్తారు. అంటే పౌరుల నాగరిక కర్తవ్యం, బాధ్యత సంబంధించి వారికి సూచన ప్రాయంగానైనా సంకేతం ఇవ్వడం.

ప్రేమ్‌చంద్ పాటించిన ఈ మూడు సూత్రాలు – నిజాయితీ (ప్రజల పక్షాన నిలవటంలో), సంఘటనలను కళ్లకు కట్టినట్టు పదాలతోనే చిత్రం అందించడం, అన్నిటికీ మించి ఒక ఆచరణయోగ్యమైన సందేశం పాఠకులకు, సమాజానికి అందించటం – ఒక ప్రమాణంగా తీసుకుని నేటి రచయితలు పని చేస్తే ప్రస్తుత కల్లోల సామాజిక పరిస్థితిలో ప్రజలు సరైన దారి వెతుక్కోవటానికి చాలా తోడ్పాటందుతుంది. ప్రేమ్‌చంద్ రాసిన వాటిలో గచన్, రంగభూమి నవలలు తప్పక చదవాలి. ఆయన రాసిన కథలు కూడా తెలుగులో పుస్తకాలుగా వచ్చాయి. ఆసక్తిగల వారికి అందుబాటులో ఉన్నాయి.

– వేదుల రామకృష్ణ, 9989033403

■ **స్పందన**

ప్రజాశక్తి సోపతి - నా అపతి

ప్రజాశక్తి పాఠకులకు పరిపరి దండాలు. నాయెత చెప్పిన కథ రాసి కన్నీళ్లు పెట్టించి పది కాలాల పాటు పాటగా బతికించిన ప్రజాశక్తికి రుణపడి ఉంటా! నాలాంటి వాణ్ణి పట్టించుకుని పత్రికా లోకం కనిపెట్టి, పనిబట్టి వలపోతను అక్షరాలతో వడపోసిన నా అనుంగ మిత్రుడు, అక్షర సంపన్నుడు ఆశయ సంస్కారుడు కదులుతున్న ఓ కెరటం, ఎదురుగాలులు ఎంత వీచినా ఎగురుతున్న జెండా, నా కంటిలోని చెమ్మ అక్షరాలతో ఆయుష్షు పోసి... నా బాధల బరువును తలా ఇంత పంచి నేనరు ప్రజాశక్తికి నా పాటల వందనం. పాటలతోనే రుణం తీర్చుకుంటా! 'నే అవమానానికి గురైనప్పుడూ.. నే... ఆశాభంగం చెందినప్పుడూ, నే... నైరాశ్యంలోకి జారిపోతున్నప్పుడు, చలో.. జాగో.. జాగోరే.. జయరాజ్ అంటూ.. నా కలానికి కర్తవ్యాన్ని బోధించింది, మమత సమతానురాగాల తల్లి పేగై తట్టి లేపింది. పాట(ఠ)కుల శక్తి మన ప్రజాశక్తి. గిజిగాడు 'గూడు' అల్లినట్టుగా అక్షరాలు పేర్చిన భూపతితో సోపతి చేస్తా. భారత్‌కు మార్క్స్, అంబేద్కర్ ప్రత్యామ్నయ ప్రజా సంస్కృతితో నా పాటల బండిని కడుతా? పాటతోనే కలుస్తా..

(గత ఆదివారం సోపతిలో ప్రాణమైన పాట జయరాజ్ ఇంటర్వ్యూపై స్పందించిన జయరాజ్)

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

అత్యధిక నవలలు రాసిన నోబెల్ మహిళ

పెర్ల్ ఎస్ బక్ పేరు చెప్పగానే 'ది గుడ్ ఎర్త్' నవల స్ఫురణకొస్తుంది. రచయిత్రిగా ఆమె విశిష్టతను ప్రపంచానికి చాటిన నవల ఇది. ఈ నవలా ఇతివృత్తానికి కొనసాగింపుగా మరో రెండు నవలలు వచ్చాయి. ఒకటి:సన్స్, రెండు: ఏ హౌస్ డివైడెడ్. మూడూ కలిపి తర్వాత ఒక ట్రయాలజీగా వెలువడ్డాయి. రచయిత్రిగా ఆమె సాహిత్యసృజనలోని అనేకానేక విశిష్టతల్ని లోకానికి తెలియజెప్పిన ట్రయాలజీ ఇది. జీవితకాలంలో దాదాపు డెబ్బయికిపైగా నవలలు రాసి చరిత్ర సృష్టించారు. బహుశా నోబెల్ సాహిత్య పురస్కారం అందుకున్న వారిలో అత్యధిక నవలలు రాసిన పేరు గడించిన వారిలో అగ్రభాగాన నిలుస్తారు. రచయిత్రిగానే కాదు మానవతావాదిగా, ఉద్యమకారిణిగా, అనేకానేక ఒడిదుడుకుల్ని ఎదుర్కొని ధైర్యంగా నిలిచిన ధీశాలి పెర్ల్ ఎస్ బక్. ఈమె తన తల్లి, తండ్రి జీవితచరిత్రలనీ వేర్వేరుగా రాయడమే కాదు, అమెరికా, ఆసియాల మధ్య పరివ్యాప్తమైన తన జ్ఞాపకాల్ని అద్భుతంగా సృజించారు. నలభై ఆరేళ్ళ వయసులోనే నోబెల్ సాహిత్య పురస్కారాన్ని అందుకున్నారు.

పెర్ల్ ఎస్ బక్
(26 జూన్ 1892-6 మార్చి 1973)

ఒక చైనా ఆయా కనుసన్నలలో పెర్ల్ పెరిగింది. ఆయా ఆమెకు చిన్న వయసులోనే అక్కడి ప్రచలిత కథలు కల్పితకథలు చెప్పేది. నాలుగేళ్ల వయసొచ్చేసరికే చైనీస్, ఆంగ్లం రెండూ మాట్లాడగలిగింది. అయితే ఆంగ్లం కంటే చైనీసే ముందు మాట్లాడటం విశేషం. తన నోటికి రెండు తలుపులని, చైనా తలుపు తెరచినపుడు, ఆంగ్లం తలుపు మూసుకుపోతుందని, అలాగే ఆంగ్లం తలుపు తెరిచినపుడు చైనా తలుపు మూసుకుపోతుందని చాలా గర్వంగా చెప్పుకునేదామె.

సాహిత్యానికి నోబెల్ బహుమతి పొందిన అమెరికా ప్రథమ మహిళ పెర్ల్ ఎస్ బక్. చైనాలో ఈమె పేరు సై ఝెంరు. అసలు పేరు పెర్ల్ కంఫర్ట్ సైడెన్ స్ట్రికర్. సైడెన్ స్ట్రికర్ ఆమె ఇంటి పేరు. తండ్రి అబ్సలం సైడెన్ స్ట్రికర్ (1852-1931), చైనాలో 1880 నుండి 1931 వరకూ ధర్మ ప్రచారకుడుగా పనిచేశారు. తండ్రి నవ్వడం ఎరగని పండితుడు. బైబిల్ని గ్రీకు నుండి చైనీస్‌లోకి అనువాదం చేయడంలో సంవత్సరాలు గడిపారు. తల్లి ఛరొలినె సైడెన్ స్ట్రికర్ (1857-1921) యవ్వనంలో విస్తృతంగా పర్యటించింది. సాహిత్యం పట్ల అమితాసక్తి ఉండేది. భర్తకు అని విధాలా సాయపడుతూ, ఏడుగురు పిల్లల్ని కన్న తల్లి ఆమె. అందులో ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. పెర్ల్ అందులో నాలుగవది. అమెరికాలో పుట్టిన ఏకైక బిడ్డ. బతికి బట్టకట్టిన ముగ్గురు పిల్లల్లో రెండవది. సెలవుల్లో తల్లిదండ్రులు అమెరికా వచ్చినపుడు పెర్ల్ జన్మించింది. మూడు నెలల ప్రాయంలోనే తల్లిదండ్రులతో చైనా వెళ్లి జీవితంలో మొదటి 40 సంవత్సరాలూ అక్కడే ఉంది. జీవితంలో సగభాగం చైనా లోనూ, సగభాగం అమెరికాలోనూ ఆమెకు గడిచిపోయింది. చైనాలో చింకియాంగ్ అన్న చిన్న పట్టణంలో ఉన్నా, తండ్రి ఎక్కువ భాగం చైనా గ్రామీణ ప్రాంతాల్లో క్రైస్తవ మత వ్యాప్తి, మత మార్పిడుల కోసం తిరిగేవారు. చైనా స్త్రీల కోసం తాను నెలకొల్పిన చిన్న చికిత్సాలయం తల్లి నడిపేది.

ఒక చైనా ఆయా కనుసన్నలలో పెర్ల్ పెరిగింది. ఆయా ఆమెకు చిన్న వయసులోనే అక్కడి ప్రచలిత కథలు కల్పితకథలు చెప్పేది. నాలుగేళ్ల వయసొచ్చేసరికే చైనీస్, ఆంగ్లం రెండూ మాట్లాడగలిగింది. అయితే ఆంగ్లం కంటే చైనీసే ముందు మాట్లాడటం విశేషం. తన నోటికి రెండు తలుపులని, చైనా తలుపు తెరచినపుడు, ఆంగ్లం తలుపు మూసుకుపోతుందని, అలాగే ఆంగ్లం తలుపు తెరిచినపుడు చైనా తలుపు మూసుకుపోతుందని చాలా గర్వంగా చెప్పుకునేదామె. చైనా పిల్లలందరితో స్వేచ్ఛగా ఆటలు అన్నీ ఆడుకునేది. ఇవన్నీ చైనా జీవితం మీద ఆమె అవగాహనకు ఆ తరువాత బాగా ఉపకరించాయి. పెర్ల్ చదువు ముఖ్యంగా తల్లి మూలంగానూ, చైనా శిక్షకుడు కుంగ్ ద్వారానే సాగింది.

1900లో బాక్సర్ తిరుగుబాటు సమయంలో (చైనా జాతీయవాదులు పాశ్చాత్యులను శత్రువులుగా చూస్తూ చంపటానికి కూడా జంకనపుడు), పెర్ల్ ఎనిమిదేళ్ల ప్రాయంలో, తండ్రి ఆచూకీ కోసం బెంగతో ఎదురుచూస్తూ, తల్లితో బాటు షాంగైలో కొన్ని నెలలబాటు తలదాచుకోవల్సి వచ్చింది. తండ్రి ఇంటికి చేరుకున్నాక, సెలవుల్లో అదే ఏడాది అందరూ కలిసి అమెరికాలో గడిపేందుకు వెళ్ళారు. అయినా తొందరలోనే చైనాకి తిరిగొచ్చారు ప్రమాదం అక్కడ ఏమాత్రం తగ్గకపోయినా.

1909లో షాంగై పాఠశాలలో పెర్ల్ చదువుతున్నప్పుడు, చైనా బానిస బాలికలు, పడుపు వృత్తిలోకి దించబడిన వారి కోసం ఉన్న ఆశ్రమంలో స్వయంసేవకురాలిగా చేరింది. వారితో గడిపిన అనుభవం ఆమె రచయిత్రిగా మారేందుకు దోహదపడింది. నాటినుంచి అణగారిన వారిపై బీద వారిపై కరుణాంతరంగంతో వ్యవహరిస్తూ వచ్చింది.

1910లో అమెరికాలోని వర్జీనియా కాలేజీలో పెర్ల్ చేరారు. 1914లో పట్టా పుచ్చుకుని, అక్కడే ఉండిపోదామనుకున్నా, తల్లి తీవ్ర అనారోగ్యంతో ఉందని తెలిసి తిరిగి చైనా వచ్చారు. 1915లో పాశ్చాత్యులు సెలవుల్లో గడిపే కులింగ్‌కి పెర్ల్ వెళ్లినపుడు, కొర్నెల్ పట్టభద్రులు, వ్యావసాయిక ఆర్థికవేత్త జాన్ లొస్సింగ్ బక్ (1917-1935)తో పరిచయమయింది. అది 1917లో వారి వివాహానికి దారితీసింది. వివాహం తరువాత అన్ హుయ్ గ్రామీణ ప్రాంతంలోని ఉన్నప్పటి వాతావరణం పరిస్థితులే వారి అనేక కథలకు, నవలలకు వస్తువుగా ఉపయోగపడింది. వారికి 1921లో మొదటి బిడ్డ కరోల్ పుట్టింది. అయితే ఆ బిడ్డ పూర్తిగా మందబుద్ధితో జన్మించింది. దానికితోడు ప్రసవ సమయంలో పెర్ల్‌కు గర్భాశయ నెత్తురుగడ్డ ఉన్నట్లు తేలి, గర్భాశయం తొలగించక తప్పలేదు. ఇక పిల్లలు కలగరన్న నిస్పృహ, తనకు ఎక్కువమంది పిల్లలుండరన్న నిరాశ జీవితాంతం ఆమెను వెంటాడింది.

పెర్ల్ రాసినకథలు, వ్యాసాలు1920 నుండి నేషన్, చైనీస్ రికార్డర్, ఆసియా, అట్లాంటిక్ లాంటి పత్రికల్లో ప్రచురణకు నోచుకోవడం మొదలైంది. 1921లో తల్లి మరణించాక తండ్రి పెర్ల్ కుటుంబంతోనే ఉన్నారు. బక్ కుటుంబం 1924-25 మధ్య కోర్నెల్ విశ్వవిద్యాలయంలో చలికాలం గడపడానికి వెళ్లినపుడు కార్నెల్ విశ్వవిద్యాలయంలో పెర్ల్ ఎం.ఏ. పూర్తి చేసారు. అప్పుడు ఆమె రాసిన సిద్ధాంత వ్యాసం 'చైనా మరియు పశ్చిమం' అనేక మన్ననల్ని పొందింది.

కాగా, పెర్ల్ వైవాహిక జీవితం కూడా ఇబ్బందుల్లో పడటంతో, కరోల్‌ని చూసుకునేందుకు వీలుగా 1930 ప్రథమార్థంలో అమెరికాకి శాశ్వతంగా తిరిగొచ్చేసారు. 1920 నుండి 1933 వరకూ ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో

ఉన్నా పెర్ల్ బక్‌ల వైవాహిక జీవితం ఆది నుండి ఒడిదుడుకులతో సాగింది. 18 ఏళ్లు మాత్రమే వారు కలిసివున్నారు. అమెరికా వెళ్లాక గ్రీన్ హిల్స్ ఫార్మ్‌లో తీసుకున్న పెద్ద ఇంటిలో మరో ఆరుగురు పిల్లల్ని పెంచుకున్నారు.

ఆమె మొదటి నవల 'తూర్పు గాలి, పశ్చిమ గాలి' 1930లో జాన్‌డే సంస్థ ప్రచురించింది. 1935లో జాన్ లొస్సింగ్ బక్‌తో విడాకులు తీసుకున్నాక, జాన్ డే ప్రచురణ కర్త రిచర్డ్ వాల్ష్ (1935-1960)నే తన రెండవ భర్తగా పెర్ల్ స్వీకరించారు.

1931లో జాన్ డే పెర్ల్ రెండవ నవల The Good Earth ప్రచురించింది. 1931, 1932 లలో అది అత్యధికంగా అమ్ముడుపోయిన నవల అయింది. ఈ నవల తొలి ఏడాదిలోనే లక్షా ఎనభై వేల కాపీలు అమ్ముడుపోయింది. 1935లో అదే నవలకు పులిట్జర్ బహుమతి, హోవెల్స్ పతకం లభించాయి. అది 1937లో చలనచిత్రంగా రూపొందింది. ఆ తరువాత వెంటవెంటనే అనేక నవలలు, పుస్తకాలు వెలువడ్డాయి. మరో రెండు-1932లో 'కొడుకులు', 1935లో 'విభజింపబడిన ఒక ఇల్లు' నవలల్లోనూ 'ది గుడ్ ఎర్త్' లోని వాంగ్ కుటుంబానికి సంబంధించిన గాథనే అద్భుతంగా చిత్రించారు. ఈ మూడు నవలలూ కలిపి ఒకే సంపుటం (ట్రయాలజీ)గా 'భాగ్యగృహం' పేరు మీద 1935లో వెలువడింది. మరణించే సమయానికి ఈ మేలైన భూమి నవలకు కొనసాగింపుగా మరో నవల 'ఎర్ర భూమి' రాసే పనిలో ఉన్నారు.

మొదటి నవల వచ్చిన పదేళ్లలోపే 1938లో నోబెల్ బహుమతి కూడా పెర్ల్‌ను వరించింది. 1973లో ఆమె మరణానికి ముందు వరకూ 100 కంటే ఎక్కువ పుస్తకాలు: నవలలు, కథా సంకలనాలు, వ్యాసాలు, నాటకాలు, బాల సాహిత్యం (1950లో వచ్చిన 'ఎప్పటికీ ఎదగని బిడ్డ', మానసికంగా ఎదగని తన సొంత కూతురు కరోల్ మీద రాసింది), చైనా నుండి అనువాదాలు ('అందరు పురుషులూ సోదరులే' చైనా నవలకు అనువాదం), జీవితచరిత్ర (1934లో తల్లిమీద 'అమ్మ' పేరున, 1938లో తండ్రి మీద 'గర్వించదగ్గ హృదయం' పేరున), ఆత్మకథ (1967లో వచ్చిన 'ఇప్పటి సమయం'), కవిత్వం మొదలైనవి వచ్చాయి.

ఎక్కువ శాతం నవలలు తూర్పు పడమరల మధ్య ఘర్షణని చిత్రించాయి. తాను స్పృశించిన ఆసియా దేశాల్లో చైనా, జపాన్‌తో బాటు భారతదేశం, కొరియాలాంటివి ఉన్నాయి. భారతదేశం మీద రాసిన ఒక నవల 'మండల' కూడా ప్రత్యేకంగా ఒకటి ఉంది. స్వతంత్ర భారతదేశంలో రాజరికాన్ని కోల్పోయిన ఒక రాజు చుట్టూ సాగే కథనం ఆ నవల. బైబిలు సంబంధమైన వచనం, చైనీస్ వివరణాత్మక కథనం, పెర్ల్ రచనలన్నిటిలో కనిపిస్తుంది. 20వ శతాబ్ది సాహిత్యంలో స్త్రీల సశరీరత ఇతివృత్తాన్ని ప్రవేశ పెట్టిన రచయిత్రి. మరో ముఖ్యమైన ఇతివృత్తం అంతర్జాతీయ ప్రేమ. విభిన్నమైన సంస్కృతుల మూలాన, స్త్రీపురుషుల మధ్య సంబంధాల మౌలిక జ్ఞానం ఆమెకే ఉండడం ఆమెకు ఎంతగానో పనికొచ్చింది.

అత్యంత ప్రజాదరణ పొందిన రచయిత్రి, మానవతావాది, స్త్రీల హక్కులకోసం నడుము బిగించిన వ్యక్తి, ఆసియా పత్రికకు సంపాదకురాలు, లోకోపకారి, చైనా జీవితాన్ని ప్రతిబింబించే రచనలు చేసి ఖ్యాతి పొందిన పెర్ల్ ఎస్ బక్‌కు 1938లో నోబెల్ సాహిత్య పురస్కారం బహుకరించారు. ఈ బహుమతి పొందటం పెర్ల్ జీవితంలో సార్థకమైన విజయం. ఆమె ఈ బహుమతి పొందిన అమెరికా మొదటి మహిళ. రెండవ వారు 1993లో ఈ బహుమతి పొందిన టోనీ మారిసన్. మానవతావాది అయిన పెర్ల్ నోబెల్ బహుమతి తీసుకునేందుకు నాజీ జర్మనీకి వెళ్లేందుకు నిరాకరించి కలకలం రేపారు. ఈ బహుమతి కంటే తన కుటుంబమే, తన పెద్ద సాఫల్యం అని చెప్పుకున్నారు. రెండు వివాహాలలోనూ తాను దత్తత తీసుకున్న పిల్లలు, పెద్ద కుటుంబం ఉండాలన్న ఆమె కలని నిజం చేసాయని భావించేవారు. "ఆమె విలువైన నిజమైన ఐతిహాసిక రైతు జీవిత వివరణ కోసం, తన జీవిత చరిత్ర సంబంధమైన ఉత్తమ రచనల కోసం" ఇస్తున్న బహుమతిగా నోబెల్ బహుమతి ప్రదాతలు ఆమెని, ఆమె సాహిత్యాన్ని గురించి అభివర్ణించారు. రచనలు చేయడం మొదలెట్టిన కొద్దికాలానికే ఆమెకు నోబెల్ బహుమతి ఇవ్వడంపై అనేక విమర్శలొచ్చాయి. తన కృషి ఇంతటితో ఆగిపోదని, అది మరింతగా ఇకముందు కూడా కొనసాగుతుందని, నోబెల్ బహుమతి స్వీకరిస్తున్నప్పుడు విమర్శలకు జవాబుగా ఆమె చెప్పారు. బహుశా ఆ కారణంగానే అలుపెరగకుండా అంత విస్తృతంగా చివరివరకూ సాహిత్య సేవ కొనసాగించారు.

1949లో ఉన్న దత్తత స్వీకార నియమాల ప్రకారం, అమెరికాలో ఆసియా, లేదా మిశ్రమ జాతి పిల్లలు దత్తతకు అనర్హులు. దానిని అసహ్యించుకుని తానే ఒక సంస్థ 'ఆహ్వాన గృహం (వెలకమ్ హౌస్)' పేరుమీద నెలకొల్పి తాను ఉన్నప్పటికే దాదాపు అయిదు వేల మంది పిల్లల్ని దత్తత తీసుకున్నారు. ఆ సంస్థే మొట్టమొదటి అంతర్జాతీయ మిశ్రమ జాతి దత్తత ప్రతినిధి సంస్థగా పేరు పొందింది. రెండవ భర్త వాల్ష్ 1960లో మరణించాక, పెర్ల్ కంటే 40 ఏళ్ల చిన్న వాడైన నాట్యాచార్యుడు టెడ్

ఎక్కువ శాతం నవలలు తూర్పు పడమరల మధ్య ఘర్షణని చిత్రించాయి. తాను స్పృశించిన ఆసియా దేశాల్లో చైనా, జపాన్‌తో బాటు భారతదేశం, కొరియాలాంటివి ఉన్నాయి. భారతదేశం మీద రాసిన ఒక నవల 'మండల' కూడా ప్రత్యేకంగా ఒకటి ఉంది.

హారిస్‌తో కలిసి ఉన్నారు.

తన 80వ జన్మదినానికి రెండు రోజుల ముందు మార్చి 1973లో పెర్ల్ మరణించారు. గ్రీన్ హిల్స్ ఫార్మ్‌లోనే వారిని సమాధి చేసారు. తల్లిదండ్రులిద్దరూ అమెరికాలో పుట్టి చైనాలో మరణించారు. పెర్ల్ మాత్రం అమెరికాలోనే పుట్టి, బాల్యం, యవ్వనం చైనాలోనే గడిపి, తరువాత జీవితం అమెరికాలో గడిపి, అమెరికాలో మరణించారు. మరణానికి ముందు రాసిన నవల అనంతాశ్చర్యం 2013లో దొరికింది. నలభై ఏళ్ల సాహిత్య జీవితంలో 100 కంటే ఎక్కువ పుస్తకాలలో 70 కి పైగా నవలలే. జాన్ సెడ్జెస్ అన్న మారు పేరుతో కూడా ఒక 5 నవలలు రాసారు. 1973లో అమెరికా అత్యున్నత జాతీయ మహిళల జాబితాలో వీరిని చేర్చారు. 1983లో పెర్ల్ పేరు మీద అమెరికా ప్రభుత్వం ఒక తపాలాబిళ్లను విడుదల చేసింది.

పెర్ల్ జీవితకాలంలో ఆమె రచనలు, పనులు, సామాజిక, జాతి లింగ పరమైన భేదభావం-అన్యాయం పట్ల, చైనాతోబాటు అంతర్జాతీయ సంబంధాల పట్ల, అమెరికన్ల ఆలోచనా విధానాల్ని అత్యంత ప్రభావితం చేసాయి. సాహిత్యంలో ఆమె కృషి, జీవకారుణ్యవాదం, తాను పుట్టిన దేశానికి, పెరిగిన దేశానికి విధేయతనే ఎక్కువగా తెలియజేస్తాయి. తానే ఒకమారు చెప్పుకున్నట్లు "ఈ ప్రపంచంలో ఏ దేశాన్ని నాదిగా భావిస్తానో చెప్పడం నాకు కష్టం. నా మాతృభూమికి నేను విధేయురాలిని అయినట్టే, ఆసియాకి కూడా అంతే విధేయురాల్ని".

- ముకుంద రామారావు, 9908347273

■ నవరాగం

ఇతరుల అనుభవాలు నేర్పుతాయా?

శతాబ్దాల మానవ జీవితమంతా ఒక పునరుక్తి అంటాడు ఓ తత్వవేత్త. నిజమే మానవ జీవితాన్ని గమనిస్తే దాదాపుగా శతాబ్దాలుగా మనుషులంతా ఒకేతీరున బతకడం కనిపిస్తుంది. పెరుగుతారు. ఏవో పనులు చేస్తారు. పెళ్ళిళ్ళు చేసుకుంటారు. పిల్లల్ని కంటారు. వాళ్ళను పెంచి పెద్ద చేస్తారు. మరల వాళ్ళకు పెళ్ళిళ్ళు.. వాళ్ళకు పిల్లలు... ఒక చర్విత చరణంలా గడిచిపోయే వలయంలాంటిదే మానవ జీవితం. అయినప్పటికీ ఎవరి అనుభవం వారిదే కదా. వారి అనుభవమే వారికి ప్రమాణం. ఇతరుల అనుభవాల్నించి నేర్చుకోడానికి సిద్ధంగా ఉండరు. చెబితే వినరు. విన్నట్టు కనిపించినా జీవితం నేర్పిస్తే తప్ప నేర్చుకోరు. ఈ మాట ప్రేమ వ్యవహారాల్లో మరింత నిజం.

"ఏ ప్రేమ వ్యవహారం చెప్పిన గుణపాఠమూ, మరో ప్రేమ వ్యవహారం ఆరంభం కాకుండా ఆపలేదు. గత అనుభవాల నుంచి సాధారణంగా మనుషులు ఏమీ నేర్చుకోలేరు అనడానికి ఇదే మంచి నిదర్శనం" అని పాల్ బార్గెట్ అనే ఫ్రెంచి నవలా రచయిత చెబుతారు. ప్రేమ గురించి ఎంత సాహిత్యం వస్తుందో తెలిసిందే. సినిమాలన్నీ దాదాపుగా ప్రేమ ఇతివృత్తం చుట్టూరానే తిరుగుతున్నాయి. ఇక ప్రేమ గురించి వేలాది సూక్తులు ఉండనే వున్నాయి. అయినప్పటికీ ప్రేమ జోలికి వెళ్ళకుండా వుండరు మనుషులు.

"ప్రేమించకు, ప్రేమించినట్టు నటించు" అంటాడొకాయన. నిజంగా ఇది సాధ్యమయ్యే పనేనా? ఆ మాట చెవిన పడ్డా మనసుకు ఎక్కదు. అందుకని మొదట్లో నటించడం ఆరంభించినా, తర్వాత జీవించడం ఆరంభిస్తారు. ఎందుకంటే ప్రేమ అలా జవజీవాలతో కదలాడే ఉద్వేగం. మనుషుల్ని తమ సొంతంగా భావించడం మొదలవుతుంది. ఎంతగా "నీవని నేనని వేరే లేనని" చెప్పుకున్నప్పటికీ ఎవరి ఊపిరి వారిదే. ఎవరి శ్వాస వారిదే. దీనిని గుర్తించకపోవడం వల్ల ప్రేమ వ్యవహారాల్లో తొలినాళ్ళ ఉద్వేగాలు, లాలసలు, తపనలు బెడిసికొడతాయి. మనుషుల్ని వస్తువుల్లా చూడటం మొదలెట్టడంతో ప్రేమలో ఉండాల్సిన జీవలక్షణం, చలనశీలత హరించుకుపోతాయి. ఈ కారణంగా మనసున పొడసూపిన ప్రేమ నాలుగు కాలాలపాటు నిలవకుండానే నిష్క్రమిస్తుంది.

ఉద్వేగాల ఒరవడిలో కొట్టుకుపోవడమే గానీ వివేచనతో ఆలోచించరు. ఫలితం ఎప్పుడోసారి బ్రేకప్ అనివార్యం. కాలం విసిరి కొట్టే దెబ్బలకు ఒకరు ఆ కొసన, మరొకరు ఈ కొసన పడతారు. మరీ ముఖ్యంగా కెరీర్‌లో కీలకమైన నిర్ణయాలు తీసుకొని ముందుకుపోయే సమయాన జాగ్రత్తగా ఉండకపోతే ప్రేమ చచ్చి ఊరుకుంటుంది. కలిసి కలబోసుకున్న కబుర్లన్నీ కాలాన్ని వృథాపుచ్చిన వైనంగా తేలిపోతాయి. అందుకని అనేకానేకం ఆలోచించడం ప్రేమలో నిలవాలనుకున్న వారు చేయాల్సిన పని.

ఆలోచనకు తావు ఇవ్వని ఉద్వేగం మనుషుల్ని ఊగించి శాసిస్తుందన్నది కూడా నిజం. కానీ ఆధునిక సమాజం విసిరిన సవాళ్ళను స్వీకరిస్తూనే జీవితాన్ని నడిపించాలి. అందుకే ఒక పక్కన ఉద్వేగాల ఒరవడిని కొనసాగిస్తూనే, మరో పార్శ్వాన సమాజ గమనంలో తన కెరీర్,

"ప్రేమించకు, ప్రేమించినట్టు నటించు" అంటాడొకాయన. నిజంగా ఇది సాధ్యమయ్యే పనేనా? ఆ మాట చెవిన పడ్డా మనసుకు ఎక్కదు. అందుకని మొదట్లో నటించడం ఆరంభించినా, తర్వాత జీవించడం ఆరంభిస్తారు. ఎందుకంటే ప్రేమ అలా జవజీవాలతో కదలాడే ఉద్వేగం. మనుషుల్ని తమ సొంతంగా భావించడం మొదలవుతుంది. ఎంతగా "నీవని నేనని వేరే లేనని" చెప్పుకున్నప్పటికీ ఎవరి ఊపిరి వారిదే. ఎవరి శ్వాస వారిదే. దీనిని గుర్తించకపోవడం వల్ల ప్రేమ వ్యవహారాల్లో తొలినాళ్ళ ఉద్వేగాలు, లాలసలు, తపనలు బెడిసికొడతాయి.

తన పాత్ర, తన ప్రయాణం ఎలా ఉండాలో తేల్చుకోవాలి. సంక్లిష్టతలు, సంక్షోభాలు, సవాళ్ళు ఎదుర్కొంటూ మనుగడ సాగించాలి కనుక. ఏ స్థాయిలో వున్న మనిషికైనా ఇవి తప్పవు. ఈ ఎరుకలోంచి జీవితాన్ని వీక్షించినప్పుడు 'ప్రేమ' స్థానం ఏమిటో, ప్రేమ నుంచి తీసుకోవల్సిందేమిటో, ఇతరుల ప్రేమ సాఫల్య, వైఫల్యాలు నేర్పేదేమిటో అవగతమవుతాయి.

నిజానికి బతుకు ప్రచారపు సరుకయిన లోకంలో నెగ్గుకు రావాలంటే ప్రేమ ఆసరా కావాలి. తనను మన్నించి తోడు ఒకరుండే మనిషి కావాలి. మనసున మనసై నిలిచే మనిషిని ఆశించలేముగానీ, కాసింత అర్థం చేసుకొని మన్నించగలిగి కరుణతో వ్యవహరించే మనిషి తోడు కావాలి. ఆ తోడుగా నిలిచే పరస్పరం ఇద్దరిలో ఉంటే వారి మధ్య ప్రేమకు ఆయుష్షు ఎక్కువ. సహనం, అర్థం చేసుకునే లక్షణం, దయాగుణం ఉండాలి. ఇవి ప్రేమలో ఉండవలసిన మౌలిక లక్షణాలు. ఇవి లోపించినప్పుడు సమాజంలోనూ, కుటుంబంలోనూ బతుకు హింసాత్మకమై బీభత్సమవుతుంది. ఈ బీభత్సం లేని జీవితం చేకూరాలంటే ప్రేమకు సంబంధించిన భావనల్నించి ఎంతో నేర్చుకోవాలి. హృదయానికి దగ్గరగా నిలవాలంటే ఎక్కడున్నా, ఏం చేస్తున్నా, ఎలా వున్నా మనసుకు నచ్చినవారిని సదా ప్రేమించే ఔదార్యం, అనురాగం ఉండాలి. అది మీకు ఉంటే ఏ దారిలోనైనా ప్రేమ మిమ్మల్ని చేరుకుంటుంది. మీ జీవితాన్ని వెలిగిస్తుంది. ఇవి మీలో ఉన్నాయో లేవో పరీక్షించుకోవాల్సింది ఇక మీరే మరి!

- ప్రణీత్

సోర్స్ కోడ్ కె.ఎక్స్.రాజు

గూగుల్ క్రోమ్ వాడుతున్నారా..?

అంతర్జాలాన్ని శోధించాలంటే... వారధిగా ఏదో ఒక బ్రౌజర్ ఉండాల్సిందే. అలాంటి వేగవంతమైన వెబ్ బ్రౌజర్‌లలో గూగుల్ క్రోమ్ ఒకటి. ఈ బ్రౌజర్‌కు ఎక్స్‌టెన్షన్‌లుగా అందుబాటులో ఉన్న పలు సరికొత్త ఫీచర్లను వెబ్ విహారాన్ని మరింత రసవత్తరం చేస్తున్నాయి. మరి, మీరు గూగుల్ క్రోమ్ వాడుతున్నారా? బ్రౌజింగ్‌లో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకుసాగే వెబ్ బ్రౌజింగ్ సాంకేతిక ప్రియులకు ఎంతో కిక్కునిస్తుంది. హోం పేజీని కావాల్సినట్టుగా మార్పులు చేసుకోవచ్చు. బుక్‌మార్క్ మెనూలోనే వాడుతున్న ఆప్స్ ఐకాన్ గుర్తుని జత చేయవచ్చు. అదే.. "ఆప్‌లాంచర్". బుక్‌మార్క్ మెనూపై రైట్‌క్లిక్ చేస్తే Show AppsShortcut పేరుతో బుక్‌మార్క్ మెనూ ప్రారంభంలో కనిపిస్తుంది. క్రోమ్ వెబ్ స్టోర్ నుంచి బ్రౌజర్‌లో ఇన్‌స్టాల్ చేసిన ఆప్స్ అన్నింటినీ ఒకేచోట అందిస్తుంది. ఇలా ఇన్‌స్టాల్ చేసిన వాటిని చూడాలంటే ముందుగా మీరు

క్రోమ్ స్టోర్‌లోకి లాగిన్ అవ్వాలి. గూగుల్ క్రోమ్ వినియోగదార్లకు ఆసక్తిని కలిగించే కొన్ని ఫీచర్లు...

- New Incognito Window : ఫైర్‌ఫాక్స్‌లో ప్రైవేట్ బ్రౌజింగ్‌విండో మాదిరిగానే ఇదీ పనిచేస్తుంది. మెనూలోని ఈ ఆప్షన్‌పై క్లిక్ చేసినప్పుడు ప్రత్యేకంగా ఒక పేజీ ఓపెన్ అవుతుంది. ఆ పేజీ నుండి బ్రౌజింగ్ చేసినదేదీ సిస్టమ్‌లో రికార్డ్ కాదు. ఉదా: మామూలుగా బ్రౌజింగ్ చేసినప్పుడు పాస్‌వర్డ్స్, వెబ్‌సైట్ల పేర్లు వంటివి కుకీస్‌లోనూ, బ్రౌజర్ హిస్టరీలోనూ రికార్డ్ అవుతాయి. ఈ అజ్ఞాత విండో నుంచి బ్రౌజింగ్ చేస్తే ఆ సమస్య వుండదు.

- యాడ్ పేజీలను బ్లాక్ చేసేందుకు : బ్రౌజింగ్ చేస్తున్న సమయంలో మౌస్ బటన్‌పై క్లిక్ చేసిన ప్రతిసారి యూజర్లను చికాకులోను చేస్తూ అనేక యాడ్ పేజీలు ఓపెన్ అవుతుంటాయ్. ఇలాంటి సందర్భాల్లో వాటిని బ్లాక్ చేసేందుకు అవకాశాన్నిచ్చే ఎక్స్‌టెన్షన్ పేరే యాడ్‌బ్లాక్ ప్లస్. ఈ ఫీచర్‌ను ఇన్‌స్టాల్ చేసుకున్నట్లయితే యాడ్ పేజీల సమస్య ఉండదు.

- ఫోటోలను తీక్షణంగా వీక్షించేందుకు 'హోవర్ జూమ్': కొన్ని ఆన్‌లైన్ రిటైలింగ్ వెబ్‌సైట్‌లలో ఉత్పత్తులకు సంబంధించిన ఫోటోలపై మౌస్ పాయింటర్‌ను పెట్టినట్లయితే తక్షణమే ఆ ఇమేజ్ జూమ్‌లో కనిపిస్తుంది. ఇదే తరహాలో, అన్ని వెబ్‌సైట్‌లలోనూ ఇలాంటి అనుభవమే కావాలంటే క్రోమ్ బ్రౌజర్‌లో అందుబాటులో ఉన్న హోవర్ జూమ్ ఎక్స్‌టెన్షన్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు.

- అన్‌ఫ్రెండ్ నోటిఫికేషన్: గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌లో అందుబాటులో వున్న మరో ఎక్స్‌టెన్షన్ 'అన్‌ఫ్రెండ్ నోటిఫికేషన్'. దీని ద్వారా మన ఫేస్‌బుక్ ఖాతా నుంచి తొలగిపోతున్న వారి జాబితాను తెలుసుకునే వీలుంది.

- పటిష్టమైన పాస్‌వర్డ్ కోసం 'లాస్ట్ పాస్': గూగుల్ క్రోమ్ బ్రౌజర్‌లో అందుబాటులో ఉన్న లాస్ట్‌పాస్ ఎక్స్‌టెన్షన్ తికమక పెట్టే గ్రామర్‌తో శక్తివంతమైన పాస్‌వర్డ్‌లను తయారు చేస్తుంది.

- షెడ్యూలింగ్ కోసం 'బఫర్' : క్రోబ్ బ్రౌజర్‌లో అందుబాటులో ఉన్న బఫర్ ఎక్స్‌టెన్షన్ ద్వారా సోషల్ నెట్‌వర్కింగ్‌లలోని పోస్ట్‌లను షెడ్యూల్ చేసుకోవచ్చు.

- మై బ్రౌజర్ పేజీ : బ్రౌజర్ ఓపెన్ చేసి మెయిల్స్ చూస్తాం... సోషల్ నెట్‌వర్క్‌లో లాగిన్ అవుతాం... వార్తల్ని చదువుతాం... సోషల్ మీడియాని బ్రౌజ్ చేస్తాం... వీడియోలు వీక్షిస్తాం... ఆన్‌లైన్ టీవీలు చూస్తాం... చెప్పాలంటే ఇంకా చాలానే చేస్తాం. మరి, ఆయా సర్వీసుల్ని ఒకేచోట ఐకాన్ గుర్తులుగా పొందాలంటే? అందుకో ప్రత్యేక హోం పేజీని క్రియేట్ చేసుకోవచ్చు. అదే My Broswer Page. 'క్రోమ్ వెబ్ స్టోర్' నుంచి బ్రౌజర్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఇన్‌స్టాల్ చేసి ఆప్స్‌లోని ఐకాన్ గుర్తుపై క్లిక్ చేస్తే ఓపెన్ అవుతుంది. మెయిల్ సర్వీసులు కావాలంటే జీమెయిల్‌తో పాటు యాహూ, హాట్‌మెయిల్ ఉన్నాయి. సోషల్ నెట్‌వర్క్‌ల గురించి చెప్పక్కర్లేదు. సోషల్ మీడియాని బ్రౌజ్ చేయడానికి అనేక వారధులు ఉన్నాయి. వినోదాన్ని అందించే అడ్డాలూ అనేకం.

- expirebox : ఇదో టెంపరరీ ఫైల్ స్టోరేజీ. ఎక్కువ మెమొరీతో కూడిన ఫైల్స్‌ని మెయిల్ చేయాలంటే మామూలుగా అయితే సాధ్యపడదు. అయితే expirebox ఆప్షన్ ద్వారా 300ఎంబి ఫైల్‌ను సైతం ఈ గుర్తుపై క్లిక్ చేసి పంపొచ్చు. అయితే ఆప్‌లోడ్ చేసిన ఫైల్ 48గంటల్లో డిలీట్ అయిపోతుంది.

- Make This your homepage: ఈ ఆప్షన్ ద్వారా మనం వాడుతున్న బ్రౌజర్స్‌లో ఎక్స్‌టెన్షన్స్ అన్నింటినీ హోం పేజీగా పెట్టుకునే వీలుంది.

` Any.DO **యాప్ :** మనం రోజువారీ పూర్తి చేయాల్సిన పనులు చాలానే ఉంటాయి. ఒక్కోసారి ముఖ్యమైన పనులను కూడా మర్చిపోతుంటాము. స్మార్ట్‌ఫోన్లలో రిమైండర్స్ పెట్టుకునే విధంగానే ఈ బ్రౌజర్‌లోనూ పెట్టుకోవచ్చు. దానికోసం క్రోమ్‌లోనే ఒక చిన్న ఆప్‌ని ఇన్‌స్టాల్ చేసుకుని అన్ని పనుల్ని పూర్తి చేయవచ్చు. అందుకు Any.DO యాప్‌ని వాడొచ్చు. ఈ యాప్‌ను పది మిలియన్లకుపైగా వినియోగదార్లు వాడుతున్నారు. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా మరో అదనపు ప్రయోజనం కూడా వుంది. అది Chrome App Launcher యాప్. ఇది పీసీలో ఇన్‌స్టాల్ అయ్యి "ఆప్ లాంచర్" స్క్రీన్‌పైనే కనిపిస్తుంది. ఎప్పుడైనా వెబ్‌స్టోర్ ఆప్స్ కావాలంటే బ్రౌజర్‌లోకే వెళ్లక్కర్లేకుండా పీసీ డెస్క్‌టాప్‌పై కనిపించే లాంచర్ షార్ట్‌కట్‌పై క్లిక్ చేస్తే సరిపోతుంది.

– బ్రౌజర్ షార్ట్ కట్స్ : క్రోమ్ బ్రౌజర్ ద్వారా ఎప్పుడూ ఫేస్‌బుక్‌ను ఉపయోగించే వినియోగదారుల కోసం ప్రత్యేకించి **కొన్ని బ్రౌజర్ షార్ట్‌కట్స్ :**

alt+m - new message
alt+0 - help center
alt+1 - homepage
alt+ 2- profile page
alt+3 - manage friends list
alt+4 - messages list
alt+5 - notification page
alt+6 - account settings
alt+7 - privacy settings
alt+8 - facebook fan page
alt+9 - facebook terms
alt+? - search box

– రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం

■ సమీక్షలు



మన ప్రపంచం
వారం వారం వ్యాఖ్యానం
దుప్పల రవికుమార్
వెల : 75/-, పేజీలు : 175
ప్రతులకు :
దుప్పల రవికుమార్
1-297, సైనిక్ నగర్,
టెక్కలి - 532201



అన్వేషణ
రేగులపాటి కిషన్‌రావు
వెల : 120/-
పేజీలు : 124,
ప్రతులకు:7396036922,
9640606404
విశాలాంధ్ర పుస్తకకేంద్రాలు



పరిమళించిన మానవత్వం
రేగులపాటి కిషన్‌రావు,
రేగులపాటి విజయలక్ష్మి
వెల:120/-, పేజీలు:104
ప్రతులకు:7396036922,
9640606404
విశాలాంధ్ర పుస్తకకేంద్రాలు



రెల్లు, బి.పి.కరుణాకర్
వెల : 80/-, పేజీలు : 128
ప్రతులకు : బి.కె.ప్రసాద్,
ఫ్లాట్ నెం.డి.304, అనురాధ
సదన్, అడిక్‌మెట్,
హైదరాబాద్.
9290828575,
040-27070244



మోహన గీతాలు
అల్లి మోహన్‌రాజ్
వెల : 80/-, పేజీలు : 74
ప్రతులకు :
9705207615,
9948963141.
విశాలాంధ్ర పుస్తకకేంద్రాలు

తీవ్రవాద దాడిని ఎదుర్కొన్న ఓ సాహస పుత్రిక



నేను మలాలా, అనువాదం : ఎస్.కె.సలీమ, వెల : 50/-
పేజీలు : 104, ప్రతులకు : ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

ఆ అమ్మాయి వయసు 17 ఏళ్లు. అయితేనేం? ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ బహుమతి ఆమెను వరించింది. ఆమె ఎవరో కాదు, మలాలా యూసఫ్‌జాయి. ఆమె తన ప్రాణాలకు తెగించి తీవ్రవాదంపై పోరాడింది. అమ్మాయిలకు బడికి వెళ్లే హక్కు ఉండాలని నినదించి, పాకిస్తాన్ ఛాందస వాదుల ఆగ్రహానికి గురయింది. విద్యతోనే స్త్రీలకు స్వేచ్ఛ లభిస్తుందని బిబిసి బ్లాగులో 11 ఏళ్ల వయసునుండే గుల్‌మకాయి పేరుతో డైరీ రాసి పాకిస్తాన్‌లో సంచలనం సృష్టించింది. తాలిబన్ల ఆగడాలతో తమ చదువు ఎలా నిలిచిపోతుందో, తమ ప్రాంత మహిళల జీవితాలు ఎంత దుర్భరంగా ఉన్నాయో ప్రపంచానికి చాటి చెప్పింది. మహిళా స్వేచ్ఛ అంటే గిట్టని తాలిబన్లు మలాలాపై తుపాకులతో దాడి చేశారు. ఆమెపై దాడి చేసింది తామేనంటూ సగర్వంగా ప్రకటించుకున్నారు. కాని ఆ సంఘటన వారిపట్ల వ్యతిరేకతను మరింత పెంచింది. కుప్పకూలిన మలాలా కోసం ఒక్క పాకిస్తాన్ మాత్రమే కాకుండా ప్రపంచం మొత్తం ఒక్కటై నిలిచింది. మృత్యులోకం నుంచి బయటపడిన మలాలా ధైర్య సాహసాలకు ప్రపంచం ఆమెను నీరాజనాలు అర్పించింది. నోబెల్ కంటే ముందే ఎన్నెన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు, రివార్డులు ఆమెను వెతుక్కుంటూ వచ్చాయి. జులై 12ను మలాలా దినోత్సవంగా ఐరాసా ప్రకటించింది. తీవ్రవాదులకు, మత ఛాందసులకు వ్యతిరేకంగా పోరాడి ఒక ప్రపంచస్థాయి శక్తిగా మలాలా యూసుఫ్‌జాయి ఎదిగిన తీరును ఈ పుస్తకం వివరిస్తుంది. బిబిసి ఉర్దూ బ్లాగు నుండి నోబెల్ ప్రైజ్ వరకు మలాలా ఎదిగిన తీరును ఇందులో చూడవచ్చు. సలీమ అనువాదం బాగుంది.

- కె.పి.అశోక్‌కుమార్

మనసుకు నచ్చే అనువాదాలు



అందరి దేవుడు ఒక్కడే , అనువాదం: ఒద్దిరాజు మురళీధర్‌రావు
పేజీలు: 120, వెల:125/-, ప్రతులకు: ఒద్దిరాజు మురళీధర్‌రావు,
1-8-702/1/1, నల్లకుంట, శంకర్‌మఠ్ పక్కన, హైదరాబాద్- 500 044

సాహిత్యం మీద ప్రేమ, అనురక్తి వున్న సృజనశీలి ఒద్దిరాజు మురళీధర్‌రావు గారు. సుప్రసిద్ధ సాహితీవేత్త లియో టాల్‌స్టాయ్ రచనలమీద వారికి ప్రత్యేకమైన మమకారం వుంది. టాల్‌స్టాయ్ కథల్ని ఇష్టంగా అనువాదం చేసిన తీరు ఈ విషయాన్ని తెలియజేస్తుంది. విశ్వజనీనమైన భావాల్ని ఆవిష్కరించిన కథలు టాల్‌స్టాయ్ రాశారు. కనుకనే శతాబ్దాలు గడిచినప్పటికీ వారి కథల్ని చదివిన పాఠకులు ముగ్ధులవుతారు. 'అందరి దేవుడు ఒక్కడే' శీర్షికన వచ్చిన పుస్తకంలో టాల్‌స్టాయ్ కథలు పద్దెనిమిది వున్నాయి. అలాగే గైడీ మొపాసా, ఓ హెన్రీ, మున్షీ ప్రేమ్‌చంద్ కథలు ఒక్కొక్కటి వున్నాయి. సరళ సుందరమైన రీతిలో వున్న అనువాదాలివి. మనసు మెచ్చేటుగా ఉండే పదజాలాన్ని ఉపయోగించడంలో అనువాదకులు మురళీధరరావు గారు సఫలమయ్యారు.

అందంగా చెబితేనే చదువుతారు. టాల్‌స్టాయ్‌కు కథన నైపుణ్యం తెలుసు. వారి కథల్లోని సౌందర్యం తెలుగులోకి తీసుకురావడంలో చూపిన అనువాదకుని ప్రతిభ ఈ కథలు చదివితే తెలుస్తుంది. ప్రత్యేకించి 'దయ ఎక్కడో దైవం అక్కడ', 'దయగల యువరాజు', 'కోడిగుడ్డంత జొన్నగింజ', 'వజ్రాలహారం', 'మ్యాగీ కానుకలు' వంటి కథలు చదవాలి. పిల్లలకు చదివి విన్పించాలి. మానవ స్వభావంలోని వైచిత్రినీ, వైవిధ్య భావాల్నీ ఆవిష్కరించిన కథలివి. సరళమైన పదాల్లో, చిన్న చిన్న వాక్యాల్లో పూసగుచ్చినట్లు కథ చెప్పే తీరు బావుంది. చదువుతున్న కొద్దీ చదవాలనిపిస్తుంది. అంత చక్కటి అనువాదమిది. ముందుమాట రాసిన ఆచార్య ఎస్.వి.రామారావు చెప్పినట్టు ఇవి ఆదర్శకథలు అనడంలో సందేహం లేదు. అలాగే మరో ముందుమాట రాసిన మునిపల్లెరాజు చెప్పినట్లు ఈ పుస్తకం పాఠశాలల గ్రంథాలయాల్లో ఉండాలి.

- కుమార్

సమకాలీన కథలు



కథా వారథి, తెలుగు సేత : ఎల్.ఆర్.స్వామి, వెల : 50/-, పేజీలు : 64, ప్రతులకు :విశాలాంధ్ర పుస్తకకేంద్రాలు

తెలుగు వాళ్లయి వుండి తెలుగు మాట్లాడ్డం నామోషీ అనుకుంటున్న రోజులివి. అలాంటప్పుడు ఒక మళయాళీయుడైన ఎల్.ఆర్.స్వామి తెలుగు నేర్చుకోవడమే కాదు, తెలుగులో రచనలు కూడా చేశారు. కొందరు ప్రముఖుల రచనలను తెలుగు నుండి మళయాళం నుండి, మలయాళం నుండి తెలుగులోకి కవితలు, కథలు అనువదించారు. ఈ 'కథా వారథి' అనే సంకలనంలోని కథలు కూడా మలయాళం నుండి అనువదించినవే. ఈ కథా సంకలనంలో మొత్తం పది కథలున్నాయి. అన్నీ ఒకదానితో ఒకటి పోలిక లేనివే. వివిధ పత్రికల్లో అచ్చయినవే. ప్రతి కథా ఏదో ఒక సన్నివేశమో, సంఘటనో, సమస్యో మొదలైన దగ్గర్నుండి చివరి వరకు రాస్తూ పోయారేమో అనిపిస్తాయి ఈ కథలన్నీ. మరొకరికి మేలు చేసినప్పుడు వచ్చిన సంతృప్తి మన ఆనందానికి 'అడ్డుగోడలు' లేకుండా చేస్తుందని ఓ కథ చెప్తే, కూతురు జీవితం నాశనమైతే తండ్రి పడే బాధ 'కృష్ణగాథ'లో కనిపిస్తుంది. లోకంలో తామొక్కళ్లమే బాధపడుతున్నట్లు ఫీలయిపోతుంటారు చాలామంది. అదే పరిస్థితిలోనో, ఇంకా ఎక్కువ బాధలోనో ఉన్న మరొకర్ని చూస్తేగానీ తమ కష్టం ఎంత చిన్నదో అర్థం కాదు. ఈ విషయం 'నియమాలు' కథలో చక్కగా చెప్పారు రచయిత. పాలకులకు, బడా వ్యాపారస్థులకు దేవుడిమీద, వాళ్ల ఆస్తుల మీద ఉన్న ప్రేమ రైతుల మీద, సామాన్య ప్రజల మీద ఉండదు. భూములన్నీ రియల్ ఎస్టేట్లయిన తర్వాత 'ఎరువుల దుకాణంలో పుస్తక పఠనం' చేయడం తప్ప అక్కడికి ఒక్కరూ ఎరువులు కొనడానికి రారు అనే విషయం ఈ కథ చెప్తుంది. ఇలా ఈ సంచికలోని ప్రతి కథా విలక్షణంగా సాగుతుంది.

కంప్యూటర్ పరిజ్ఞానానికో పుస్తకం





ఎం.ఎస్.ఆఫీస్, మేడ్ సింపుల్ (తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలు విడివిడిగా),వెల : 125/-, పేజీలు : 171.
ఫొటోషాప్, మేడ్ ఈజీ (తెలుగు), వెల : 120/-, పేజీలు : 173, డా॥కె.కిరణ్‌కుమార్, ప్రతులకు : అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు.

ప్రస్తుత కాలంలో కంప్యూటర్ అంటే తెలియనివాళ్లు లేరు. అందులో చేయలేని పని లేదు. కె.జి పిల్లాడి మొదలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వరకు దాదాపు చదువుకున్న ప్రతి ఒక్కరికీ కంప్యూటర్ తెలుసు. కొద్దిగా తెలుగు, ఇంగ్లీషు పరిజ్ఞానం ఉన్నవాళ్లు సైతం ఈ పుస్తకాన్ని చదువుతూ ఎం.ఎస్.ఆఫీస్ పూర్తిగా నేర్చుకోవచ్చు. అంత తేలికైన పద్ధతిలో విపులంగా చెప్పారు కె.కిరణ్‌కుమార్. ఇందులో ఏఏ భాగాలుంటాయో, అవి ఎలా పనిచేస్తాయో మౌస్‌ను ఎలా కదపాలో, కీబోర్డ్‌లో ఏ బటన్ ఎలా, ఎందుకు పనిచేస్తుందో బొమ్మలు, గీతలతో సహా చక్కగా వివరించారు. విండోస్ అంటే ఏంటో తెలిపారు. ఎం.ఎస్.ఆఫీస్‌లోని ఎం.ఎస్.వర్డ్, ఎం.ఎస్.ఎక్సెల్, ఎం.ఎస్.పవర్‌పాయింట్, ఎం.ఎస్.యాక్సెస్‌లలోని అన్ని ఆప్షన్ల వివరాలూ ఇందులో పొందుపరిచారు. ఒక డాక్యుమెంటు ఓపెన్ చేయడం దగ్గరనుండి, అందులో ఎన్ని రకాల అప్లికేషన్లు ఉంటాయో, వాటిని ఎలా ఉపయోగించాలో, ఎలా సేవ్ చేయాలో, చివరికి ప్రింట్ ఎలా ఇవ్వాలో కూడా దశల వారీగా వివరించారు. పాత వర్షన్‌తో పాటు అడ్వాన్స్ వర్షన్ కూడా ఇందులో ఇచ్చారు. ఈ పుస్తకం తెలుగులో, ఇంగ్లీషులో లభిస్తుంది.

ఇదే రచయిత రాసిన మరో పుస్తకం ఫొటోషాప్. ఇది నేర్చుకుంటే సృజనాత్మకంగా ఆలోచించే వాళ్ల ఊహలకు రెక్కలు వచ్చినట్లే. దీనిమీద కూర్చుంటే సమయం మంచినీళ్లలా ఖర్చయిపోతుంది. డ్రీమ్‌వీవర్, ఫ్లాష్, మాయ, యానిమేషన్ లాంటి మల్టీమీడియా కోర్సులు నేర్చుకునేవాళ్లకు, వెబ్ డిజైనింగ్ నేర్చుకునేవాళ్లకు ఈ ఫొటోషాప్ మొదటిమెట్టు. ఉన్నది లేనట్టు, లేనిది ఉన్నట్టు భ్రమింపచేయాలన్నా ఇందులో సాధ్యమే. ఇందులోని ఆప్షన్లు, లేయర్లమీద ఎలా పనిచేయాలో, టూల్ బార్ ఎలా ఉంటుందో అంతా అరటిపండు తొక్క వలిచిపెట్టినట్టు అన్ని వివరాలూ ఇందులో ఉన్నాయి. ఇందులో ఎన్నో అద్భుతాలు చేయొచ్చు. ఎప్పుడో ఇరవై, ముప్పై ఏళ్లనాటి ఫొటోనుకూడా సరికొత్తగా తయారు చేయొచ్చు దీనితో. ఒక రకంగా చెప్పాలంటే మేకప్ మేన్ సినీ తారలకు మేకప్ వేసి ఆకర్షణీయంగా ఎలా తయారు చేస్తారో, ఈ ఫొటోషాప్‌తో కూడా అన్ని జిమ్మిక్కులు చేయొచ్చు. అంతటి అద్భుతమైన పుస్తకాన్ని చాలా సులభంగా నేర్చుకోడానికి తేలికైన పరిభాషలో బొమ్మలతో సహా వివరించారు రచయిత. ఈ పుస్తకమే ఒక గురువు అనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

- అఖిల

మీరూ రాయండి

మీరు చదివిన వాటిలో మీకు బాగా నచ్చిన పుస్తకం గురించి ఈ శీర్షికకు రాసి పంపండి. మీ ఫొటో కూడా జతచేయండి. పుస్తకంలో మీకు నచ్చిన అంశాల గురించి రాయండి. పుస్తకం ఎందుకు నచ్చిందో ఒకటీ రెండు మాటల్లో చెబితే మంచిది. 'నాకు నచ్చిన పుస్తకం' శీర్షికన ప్రచురిస్తాం. మీ అభిప్రాయాలు చేరాల్సిన చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-500030.

గమనిక

- సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.
- రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.
- పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్.భవన్, ఆజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500030.

■ ఈ వారం కవిత్వం

బతికిన రోజులు

ఏంటి?
తాజాగా ఉన్నావ్?
ఊరెళ్ళాను!
మాముసలి ఇంటి
బోసినవ్వుల్తో నవ్వు కలిపాను
మొక్కల్తో మాట్లాడాను
పక్షుల్తో నా గానాభజానా!
సీతాకోకచిలుకల్తో ఎగిరాను
వాటి రెక్కల్తోనే-
చెరువు కౌగిలిలో సేదదీరాను

కొన్ని నా పాత అడుగుల్ని
ఏరుకొచ్చుకున్నాను
జ్ఞాపకాల్ని చుట్టూ పర్చుకుని
దుమ్ము తుడ్చాను
మా ఇంటి ముందరి
వేప చెట్టుపందిరి కింద చల్లబడ్డాను
పెరట్లోని
మామిడికంటి ఎరుపుతో
నా ఎర్ర రక్తకణాల్ని పోల్చుకున్నాను
ఎర్రమట్టి గోడమూతి
రామచిలుక కాగాలు వింటున్న జామ
ఓ జాము ఆతిథ్యమిచ్చింది
సపోట చెట్టుతో సమావేశం
సడలిన బంధాల సంభాషణైయింది
గుర్తుపట్టనందుకు
ఓ చిన్నారి పనస మొక్క చిన్నబోతే
చక్కిలిగింతలతో చెలిమి చేశాను
శీతజడల సవరిస్తున్నప్పుడే



ఉడుత గంతుల కచేరి కనువిందైయ్యింది
గులాబీ గుండెల్లో మునిగిన మత్తులో
తుమ్మెద చెవుల్నే కోల్పోయింది
బంతుల గోరింటల
పొడుగు పొట్టి గొడవలో
తంగేడూ నేను తగవు తీర్చాము
పిచ్చుకలు లేని వరి గొల్సుల జడ
పక్కింటి వరండాలోంచి ఎక్కిరించింది
కాకులు లేని తోటమధ్య
'కాకిబలగం' సెల్లెత్తుకపోయిందేమో!?
హమ్మో!
కోతులతో పాలి పగైయ్యింది

ఎంతకీ వదలని
పరికికంప ప్రేమలోనే
సూర్యోదయంతో నడిచాను
అనేకసార్లు
చెరువుకట్టచిర్నుంచి
సాయంత్రం చలితో
వణుకుతున్న సూర్యుడికి
నల్లగొంగడి కప్పివచ్చాను
నాగలి భుజాన మోస్తున్న క్రీస్తుతో కలిసి
ఏం చెప్పను?
మనిషిని చేసే
వొక మంత్రిత సమయం
బహుశా!
కొన్ని రోజులు
బతికినట్లయ్యింది.

- వడ్డెబోయిన శ్రీనివాస్, 9885756071

పూలు - పిల్లలు

సృష్టిలోని అందమైన రూపాల్లో
విలక్షణమైనవి సలక్షణమైనవి విశిష్టమైనవి
పూలు పిల్లలు
సృష్టిలోని అందాలన్నీ
కలబోసినట్లుంటాయి పూలు
ప్రపంచంలోని ఆనందాలన్నీ
ఒక్కచోటే చేరినట్లుంటారు పిల్లలు

మృదుత్వానికి సున్నితత్వానికి
ప్రతీకలు
సృష్టిలోని అందానికి
ప్రతి నిధులు
ప్రకృతికే అందాన్నిస్తాయి
కొత్త శోభను తెస్తాయి పూలు
కుటుంబాన్ని ఆనందంలో తేలేట్లు
ప్రపంచాన్ని మరిచేట్లు చేస్తారు పిల్లలు

- డా॥సమ్మెట గోవర్ధన్,
949038471



ఇది యు.ఎస్.ఎ. మిచిగాన్‌లోని గ్రాండ్ ఐలాండ్ ఎస్టేట్ కెనాల్ లైట్ హౌస్. ఇక్కడ ఎండాకాలంలో ఆకుపచ్చ తివాచీ వేసినట్లుండే ప్రకృతి వసంతకాలం రాగానే ఇంద్రధనస్సులోని రంగులన్నీ అద్దుకున్నాయా అనిపించేట్లుగా మారిపోతుంది.

మీ కొరకై ..... నిరంతర అన్వేషణే జైన్ కంపెనీ లక్ష్యం

50 సంవత్సరముల నుండి సాగునీటి పారుదలలో అత్యధిక నీటి వినియోగ సామర్ధ్యము కొరకు ఉపయోగపడు పరికరములు కనుగొనుటకు, అలుపెరుగని శ్రమతో ప్రయత్నము చేయుచున్న జైన్ కంపెనీ, ప్రపంచ రైతాంగపు ఆర్థిక వొడుదుడుకులను అధిగమించుటకు అందిస్తున్న అతి విశిష్టమైన వస్తువే జైన్ టర్బోస్లిమ్ లేటరల్ ...

ఇది తక్కువ పెట్టుబడితో అధిక పంటతో అధిక లాభాలు పొందవచ్చును. 'జైన్ టర్బోస్లిమ్'. తక్కువ మందము కలిగి నాణ్యమైన లేటరల్‌పైపు

- 'జైన్ టర్బోస్లిమ్' సాధారణముగా 16 మి.మీ (5/8 అంగుళములు) సైజులో 6,8,10,12,15 మీల్ మందములో లభ్యమగును.
- జైన్ టర్బోస్లిమ్ నేలపైన మరియు నేలలోపల అమర్చుటకు అనువయినది.

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/ బి /5, పార్క్ ఎదురుగా, కెనరాబ్యాంక్ దగ్గర,
గాంధీనగర్, హైద్రాబాద్- 500 080.
ఫోన్: 040-2761 4474, 2765 4681. 9440797846.
Email: jainhyderabad@jains.com, Website: www.jains.com

బూర బొమ్మలు

బూరలు ఉఫ్... అని నోటితో ఊదితేనే అల్లంత దూరం ఎగిరిపోతాయి. గుండుసూది, గోరుల్లాంటివి గుచ్చుకుంటే ఎంత పెద్ద బూరైనా పటక్కున పగిలిపోతాయి. అయినా సరే పిల్లలకి బూరలంటే చాలు ఎక్కడలేని హుషారు వచ్చేస్తుంది. వాటితో ఎన్నిరకాలుగా ఆడుకుంటారో చెప్పక్కర్లేదు. ఇక్కడున్న బొమ్మలన్నీ బూరలతో చేసినవే! ఎంత ఆకర్షణీయంగా తయారు చేశారో చూడండి... వీటికోసం ఎంత కష్టపడ్డాడో వీటిని చేసిన కళాకారుడు.